వాయిస్ అఫ్ ప్రజలు
# వాయిస్ టుడే
Title Code : T/TG/2024/0625/0392/884
TGTEL/25/A2649
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 10
బుధవారం, ఫిబ్రవరి 4, 2026
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## వాట్సాప్ ప్రైవసీ పాలసీ.. మెటా కంపెనీకి వార్నింగ్ ఇచ్చిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: టెక్నాలజీ దిగ్గజం, వాట్సాప్ ఓనర్లు మెటా కంపెనీకి .. ఇవాళ సుప్రీంకోర్టు సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. వాట్సాప్ ప్రైవసీ పాలసీ అంశంలో కోర్టు తన హెచ్చరిక జారీ చేసింది. ఓ కేసులో ఇవాళ సుప్రీంలో వాదనలు జరిగాయి. మా దేశ ప్రైవసీతో మీరు ఆటలాడుకోలేరని, మాకు చెందిన సింగిల్ డిజిట్ డేటాను కూడా షేర్ చేసుకునేందుకు అనుమతి ఇవ్వబోమని, మా దేశ చట్టాలను ఫాలో అవ్వకుంటే, మీరు ఈ దేశాన్ని విడిచి వెళ్లవచ్చు అని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.



# ప్రచారానికి మిగిలింది వారమే

**సర్వేల్లో 90% కాంగ్రెస్‌కే సానుకూలం.. మునిసిపోల్స్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోండి**

**ఇన్‌చార్జి మంత్రులు అందర్నీ కలుపుకొని వెళ్లాలి.. రెండ్రోజులకోసారి జూమ్‌లో భేటీ**

**మంత్రులతో సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి.. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా సమీక్ష**

**వార్డుల్లో బీసీలకు 56 ఇచ్చినట్లు లెక్క.. రెబెల్ అభ్యర్థులు 2 లోపేనని గుర్తింపు**

హైదరాబాద్, ఫిబ్రవరి 3 : మునిసిపల్ ఎన్నికల ప్రచారానికి ఇంకా వారం రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో కాంగ్రెస్ పార్టీ దూకుడు పెంచింది. ఈ కీలక దశలో మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ యంత్రాంగం మొత్తం క్షేత్రస్థాయిలోనే ఉండి పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఎన్నికలను పార్టీ ప్రతిష్ఠకు సంబంధించినవిగా భావించి, సమిష్టిగా ముందుకు సాగాలని మంత్రులకు స్పష్టం చేశారు. మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో మునిసిపల్ ఎన్నికలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన కీలక సూచనలు చేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు. ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్న లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలోని రాజకీయ పరిస్థితులపై మంత్రులు సమగ్ర నివేదికలను సీఎంకు సమర్పించారు. తాజా సర్వేలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయని సీఎం వెల్లడించారు. దాదాపు 90 శాతం మునిసిపాలిటీల్లో పార్టీ గెలుపు సాధిస్తుందనే అంచనాకు వచ్చినట్లు తెలిపారు. పార్టీ గుర్తుపై జరుగుతున్న ఈ ఎన్నికలను అత్యంత ప్రాధాన్యతతో తీసుకోవాలని, ఎక్కడా నిర్లక్ష్యానికి తావు లేకుండా పనిచేయాలని మంత్రులకు సూచించారు. ఇన్‌చార్జ్ మంత్రులు తమ పరిధిలోని స్థానిక నాయకులందరినీ కలుపుకొని వెళ్లాలని, పాతకొత్త నేతల మధ్య సమన్వయం సాధించాలని చెప్పారు. కొన్ని మునిసిపాలిటీల్లో నేతల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఓట్లు చీలకుండా చూసే బాధ్యత పూర్తిగా

(మిగతా 2వ పేజీలో)





## నేడు తెలంగాణకు నితిన్ నబీన్

**జాతీయ అధ్యక్షుడిగా తొలి పర్యటన**

**మహబూబ్‌నగర్‌లో భారీ కార్యకర్తల సమ్మేళనం**


**మున్సిపల్ ఎన్నికల వేళ కీలక సందేశం**

**లైవ్ స్ట్రీమింగ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వీక్షణ**

**పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెంచే యత్నం**

హైదరాబాద్, ఫిబ్రవరి 3: భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత నితిన్ నబీన్ మిశ్రా తొలిసారిగా తెలంగాణకు వస్తున్నారు. బుధ వారం ఆయన మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించి, పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశంలో పాల్గొననున్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎంవీఎస్ డిగ్రీ కాలేజ్ మైదానంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరుకానున్నారు. సమావేశాన్ని ఉద్దేశించి నితిన్ నబీన్ ప్రసంగించనున్నారు. మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన లైవ్ స్ట్రీమింగ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఈ సమావేశాన్ని వీక్షించనున్నట్లు

(మిగతా 2వ పేజీలో)



## నేనేం పాపం చేశాను?

**టికెట్ల వ్యవహారంపై జీవన్‌రెడ్డి ఆవేదన**

**వలసవాదులకు ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపణ**

**శిక్షించాలంటే నన్నే చేయండి: కాంగ్రెస్ సీనియర్ నేత**

**జెండా మోసిన వారికే అండగా ఉంటా**

జగిత్యాల, ఫిబ్రవరి 3: మునిసిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జగిత్యాల, రాయికల్ మున్సిపాలిటీలకు సంబంధించి బీఫామ్‌ల కేటాయింపులో నిబద్ధ కార్యకర్తలను పక్కనపెట్టి ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇచ్చారని ఆయన ఆరోపించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడిన జీవన్‌రెడ్డి, పార్టీ కోసం నాలుగు దశాబ్దాలుగా పనిచేసిన తనలాంటి వారిని విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. 'నేనేం పాపం చేశాను? తినే ముందు పల్లెం ఎత్తుకెళ్లినట్టుగా కార్యకర్తలను పక్కన పెట్టారు. రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని బలపర్చడమే నా తప్పా?' అని ప్రశ్నించారు. మునిసిపల్ ఎన్నికల కోసం క్షేత్రస్థాయి కార్యకర్తల అభిప్రాయాల మేరకు సర్వే నిర్వహించి జాబితా సిద్ధం చేశామని తెలిపారు. అయినా

(మిగతా 2వ పేజీలో)

## బయోఫార్మా 'శక్తి'తో హైదరాబాద్‌కు కొత్త ఊపిరి



**బడ్జెట్‌తో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం: కిషన్‌రెడ్డి**

**ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లలో మూడు హైదరాబాద్ నుంచే**

**ఉపాధి, రక్షణ రంగాలకు ప్రాధాన్యం**

**తెలంగాణకు పెరిగిన పన్నుల వాటా**

**అభివృద్ధిలో మరో ముందడుగు: కేంద్ర మంత్రి**

## జగిత్యాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురు మృతి

**ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడటంతో వ్యవసాయ కూలీలు మృతి**

**పసుపు కోతకు వెళ్లి వస్తుండగా నీటి గుంతలో పడిన ట్రాక్టర్**

**గాయపడిన వారు సమీపంలోని ఆసుపత్రికి తరలింపు**




## ఎంఐఎం పార్టీలో విషాదం.. సీనియర్ నేత అహ్మద్ పాషా ఖాద్రీ కన్నుమూత

**హైదరాబాద్‌లోని ఓవైసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత**

**గత రెండేళ్లుగా కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న సీనియర్ నేత**

**చార్మినార్ నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన పాషా ఖాద్రీ**



### అమెరికాతో వాణిజ్య ఒప్పందం...
## ప్రధాని మోదీకి సన్మానం

**వాణిజ్య ఒప్పందం కోసం మోదీ చేసిన కృషికి గాను సన్మానం**

**ప్రధానిని పార్లమెంటు ఆవరణలో సన్మానించిన ఎన్డీయే ఎంపీలు**

**'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' అంటూ నినాదాలు**



న్యూఢిల్లీ: భారత్‌తో ట్రేడ్ డీల్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓకే చెప్పిన నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఎన్డీయే ఎంపీలు సన్మానం చేశారు. ఈ ఒప్పందం కోసం మోదీ చేసిన కృషికి గాను వారు సన్మానం చేశారు. ఈ సన్మానం సమయంలో ఎంపీలు 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' అంటూ నినాదాలు చేశారు. పార్లమెంటు ప్రాంగణంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల పార్లమెంటరీ పార్టీ భేటీ జరిగింది. ఈ భేటీ నేపథ్యంలో మొదట మోదీని సన్మానించారు. అనంతరం పార్లమెంటులో ప్రతిపక్షాల విమర్శలపై స్పందనలు, పార్లమెంటులో అనుసరించాల్సిన వ్యూహాలపై

(మిగతా 2వ పేజీలో)



## లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తత... 8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్

**బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు వేటు వేసిన ఇన్చార్జి స్పీకర్**

**చైర్ వైపు కాగితాలు విసిరి, సభకు అంతరాయం కలిగించారని ఆగ్రహం**

**చైనా సరిహద్దు వివాదంపై చర్చకు పట్టుబట్టిన రాహుల్ గాంధీ**

**మాజీ ఆర్మీ చీఫ్ నరవణే పుస్తక ప్రస్తావనపై సభలో వాగ్వాదం**

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సభలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి, నిరసన పేరుతో కాగితాలను చింపి స్పీకర్ చైర్ వైపు విసిరారన్న కారణంతో 8 మంది కాంగ్రెస్ ఎంపీలను లోక్‌సభ నుంచి సస్పెండ్ చేశారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని స్పీకర్ ప్యానెల్ ఆఫ్ చైర్ పర్సన్స్ లో ఒకరైన దిలీప్ సైకియా (ప్యానెల్ స్పీకర్) ప్రకటించారు. సస్పెన్షన్ వేటు పడిన వారిలో అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మాణికం ఠాగూర్, గురుజీత్ సింగ్ ఆజులా, హిబి ఈడెన్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రశాంత్ యాదవరావు పడోలే,

(మిగతా 2వ పేజీలో)

## బీఆర్ఎస్ పాలనలో భూ కబ్జాలే అభివృద్ధి

**కాంగ్రెస్ వద్ద నిధులే లేవు: బండి సంజయ్**

**మేయర్ పీఠం ఇస్తే కేంద్రం నుంచి భారీ నిధులు తెస్తా**

**కరీంనగర్‌లో స్ట్రీట్ కార్నర్ మీటింగ్**

**రూ.1,500 కోట్ల అభివృద్ధి పనుల వివరాల విడుదల**

**బీజేపీకే నగర భవిష్యత్తు అప్పగించాలన్న పిలుపు**

కరీంనగర్, ఫిబ్రవరి 3: బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా భూ కబ్జాలు విస్తృతంగా జరిగాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. పదేళ్ల పాలనలో కనిపించిన ప్రతి ఖాళీ స్థలాన్ని ఆక్రమించి ప్రజల ఆస్తులను దోచుకున్నారని మండిపడ్డారు. మంగళవారం కరీంనగర్ నగరంలోని కోతిరాంపూర్ చౌరస్తాలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌ను మరోసారి గెలిపిస్తే ప్రజల ఇళ్లకూ భద్రత ఉండదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులే లేవని,

(మిగతా 2వ పేజీలో)



# బయోఫార్మా ‘శక్తి’తో హైదరాబాద్‌కు కొత్త ఊపిరి

**బడ్జెట్‌తో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం: కిషన్‌రెడ్డి**

**ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లలో మూడు హైదరాబాద్ నుంచే**

**ఉపాధి, రక్షణ రంగాలకు ప్రాధాన్యం**

**తెలంగాణకు పెరిగిన పన్నుల వాటా**

**అభివృద్ధిలో మరో ముందడుగు: కేంద్ర మంత్రి**



దిల్లీ, ఫిబ్రవరి 3: కేంద్ర బడ్జెట్ దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా రూపొందించబడిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బడ్జెట్ ప్రకటన అనంతరం ఆదివారం దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్2026 ద్వారా ఉపాధి అవకాశాలు విస్తృతంగా పెరుగుతాయని, రక్షణ రంగం మరింత శక్తివంతమవుతుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లను ప్రకటించగా, వాటిలో మూడు హైదరాబాద్ నుంచి ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఇది తెలంగాణ ప్రజలు గర్వించదగ్గ అంశమని అన్నారు. అభివృద్ధిలో వేగంగా దూసుకుపోతున్న హైదరాబాద్‌కు హైస్పీడ్ రైల్ ప్రాజెక్టులు రావడం ఎంతో ప్రాధాన్యమని చెప్పారు. బడ్జెట్‌లో ప్రకటించిన బయోఫార్మా ‘శక్తి’ కార్యక్రమం హైదరాబాద్‌కు మరింత మేలు చేకూరుస్తుందని స్పష్టం చేశారు. ఫార్మా, బయోటెక్ రంగాల్లో పెట్టుబడులు పెరిగి, ఉపాధి అవకాశాలు విస్తరించే అవకాశం ఉందన్నారు. ఎరువుల సబ్సిడీకి గతంతో పోలిస్తే రూ.7 వేల కోట్ల మేర కేటాయింపులు పెంచినట్లు తెలిపారు. అలాగే తెలంగాణకు కేంద్ర పన్నుల వాటా 13.5 శాతం పెరిగిందని చెప్పారు. భారతీయ వస్త్ర పరిశ్రమకు చేయూతనిచ్చే నిర్ణయాల వల్ల వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు లాభం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. బడ్జెట్‌లో జిల్లాకో బాలికల హాస్టల్ ప్రకటించడంతో తెలంగాణలోని అన్ని జిల్లాలకు హాస్టళ్లు వచ్చే అవకాశం ఉందన్నారు. అలాగే హైదరాబాద్ వంటి నగరాలు మున్సిపల్ బాండ్ల ద్వారా రూ.వెయ్యి కోట్లకు మించి నిధులు సమీకరిస్తే, కేంద్రం నుంచి అదనంగా రూ.100 కోట్ల ప్రోత్సాహకం లభిస్తుందని తెలిపారు. మెట్రో రెండో దశకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ సమర్పిస్తే, కేంద్రం నిధులపై తగిన నిర్ణయం తీసుకుంటుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ బడ్జెట్ ద్వారా తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా అభివృద్ధికి బలమైన పునాది పడుతుందని ఆయన వ్యాఖ్యానించారు.

## జగిత్యాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురు మృతి

**ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడటంతో వ్యవసాయ కూలీలు మృతి**

**పసుపు కోతకు వెళ్లి వస్తుండగా నీటి గుంతలో పడిన ట్రాక్టర్**

**గాయపడిన వారు సమీపంలోని ఆసుపత్రికి తరలింపు**



జగిత్యాల జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడటంతో నలుగురు వ్యవసాయ కూలీలు మృతి చెందారు. వ్యవసాయ కూలీలు ఉదయం పసుపు కోతకు వెళ్లారు. పసుపు కోత పూర్తయ్యాక తిరిగి వస్తుండగా మల్లాపూర్ మండలం ముగిలిపేట వద్దకు రాగానే ట్రాక్టర్ అదుపు తప్పి నీటి గుంతలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు కూలీలు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

## బీఆర్ఎస్ పాలనలో భూ కబ్జాలే అభివృద్ధి

ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే బహిరంగంగా చెప్పారని గుర్తుచేశారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అభివృద్ధికి నిధులు ఎక్కడి నుంచి తెస్తారో చెప్పాలని సంజయ్ ప్రశ్నించారు. కరీంనగర్ అభివృద్ధి కోసం తాను కేంద్రం నుంచి రూ.1,500 కోట్ల నిధులు తీసుకొచ్చానని తెలిపారు. ఆ వివరాలన్నింటినీ బుక్‌లెట్‌గా ముద్రించి ఇంటింటికీ పంపిస్తున్నామని చెప్పారు. ఈ వివరాలు తప్పైతే తనపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని ఆయన సవాల్ విసిరారు. రెండోసారి ఎంపీగా గెలిచిన తర్వాత కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కరీంనగర్‌కు తీసుకురావడంతో రూ.50 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. స్మార్ట్ సిటీ పరిధిలో చెత్త బయోమైనింగ్ చేసినందుకు మరో రూ.18 కోట్ల కేంద్ర నిధులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. అయితే గతంలో బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యామ్నాయ స్థలం చూపకుండా అడ్డంకులు సృష్టిస్తున్నాయని సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య మూడో స్థానం కోసం మాత్రమే పోటీ కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. కరీంనగర్ అభివృద్ధి కోసం కేంద్రంతో పోరాడి నిధులు తీసుకొచ్చే బీజేపీకి ప్రజలు మేయర్ పీఠాన్ని అప్పగించాలని ఆయన కోరారు. మోసపూరిత హామీలు ఇచ్చే పార్టీలకు కాకుండా అభివృద్ధి తీసుకొచ్చే శక్తికి అవకాశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ మేయర్ సునీల్‌రావుతో పాటు 9, 39, 40 డివిజన్ల బీజేపీ అభ్యర్థులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఫైర్ సేఫ్టీ పాఠాలు చెబుతున్న హైడ్రా

**హైదరాబాద్‌లో అగ్ని ప్రమాదాల నివారణకు హైడ్రా అవగాహన కార్యక్రమాలు**

**వరుస ప్రమాదాల నేపథ్యంలో నగర ప్రజలను అప్రమత్తం చేసేందుకు చర్యలు**

**ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ల వాడకం, భద్రతా చర్యలపై ప్రాక్టికల్ డెమోలు**

**నిబంధనల అమలుకు వాణిజ్య సముదాయాలకు నెల రోజుల గడువు**

**నగరంలోని 30కి పైగా ప్రాంతాల్లో మాక్ డ్రిల్స్, అవగాహన సదస్సులు**



హైదరాబాద్ నగరంలో ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న అగ్ని ప్రమాదాల నేపథ్యంలో హైడ్రా అప్రమత్తమైంది. ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించే లక్ష్యంతో ప్రజల్లో అగ్ని భద్రతపై అవగాహన కల్పించేందుకు నగరం నలుమూలలా భారీ ఎత్తున ప్రత్యేక కార్యక్రమాలను ప్రారంభించింది. ముఖ్యంగా వాణిజ్య సముదాయాలు, జనసాంద్రత అధికంగా ఉండే ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఇటీవల నాంపల్లిలోని ఓ ఫర్నీచర్ షోరూంలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంతో పాటు, నగరంలోని ఇతర ప్రాంతాల్లో జరిగిన ఘటనలు ఈ చర్యలకు ప్రధాన కారణంగా నిలిచాయి. చాలా వాణిజ్య భవనాల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించడం లేదని అధికారులు జరిపిన తనిఖీల్లో వెల్లడైంది. ఈ నేపథ్యంలో, అగ్నిమాపక భద్రతా నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించేందుకు వాణిజ్య సంస్థలకు నెల రోజుల గడువు ఇస్తూనే, మరోవైపు ఈ అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా, అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఒకవేళ ప్రమాదం సంభవిస్తే మంటలను ఎలా అదుపులోకి తీసుకురావాలనే అంశాలపై వివరిస్తున్నారు. ముఖ్యంగా ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ల వినియోగం, మానవ ప్రమేయం లేకుండా మంటలను ఆర్పే ఆటోమేటిక్ వాటర్ స్ప్రింక్లర్లు, పొగను గుర్తించే స్మోక్ డిటెక్టర్ల పనితీరుపై ప్రాక్టికల్‌గా చూపిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. షాపులు, కార్యాలయాల్లో ఫైర్ ఎగ్జిట్ మార్గాలను గుర్తించడం, వాటిని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కిచెబుతున్నారు. పంజాగుట్ట, మాదాపూర్, గచ్చిబౌలి-మియాపూర్, దిల్‌సుఖ్‌నగర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ క్లాక్ టవర్, అల్వాల్, బంజారాహిల్స్, శంషాబాద్, కొంపల్లి, నాంపల్లి వంటి 30కి పైగా ప్రధాన ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. కొన్ని చోట్ల ఫైర్ మాక్ డ్రిల్స్ కూడా నిర్వహించి, ప్రమాద సమయంలో సురక్షితంగా ఎలా బయటపడాలో కార్మికులకు, వ్యాపారులకు సూచించారు. ఏదైనా ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక శాఖకు చెందిన 101 నంబర్‌తో పాటు, హైడ్రా కంట్రోల్ రూమ్ నంబర్ 1070 లేదా మొబైల్ నంబర్ 9000113667కు ఫోన్ చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## పోటీదారులతో పోలిస్తే అమెరికాతో భారత్ మెరుగైన ఒప్పందాన్ని సాధించింది: పీయూష్ గోయల్

దేశ ప్రయోజనాల విషయంలో రాజీపడకుండా పోటీదారులతో పోలిస్తే భారత్ మెరుగైన ఒప్పందాన్ని సాధించిందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం భారత ఉజ్వల భవిష్యత్తుకు ఒక శుభసూచకమని ఆయన అన్నారు. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ఈ ఒప్పందాన్ని ప్రధాని మోదీ కొలిక్కి తీసుకువచ్చారని అన్నారు. ఈ విషయంలో దేశమంతా ఆయనకు అభినందనలు తెలుపుతోందని అన్నారు. ఈ ఒప్పందంతో పేదలు, రైతులు, యువత, మత్స్యకారులకు అపారమైన అవకాశాలు లభిస్తాయని అన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై పార్లమెంటులో ప్రకటన చేద్దామని భావించానని, కానీ రాహుల్ గాంధీ నేతృత్వంలోని ప్రతిపక్షం గందరగోళ పరిస్థితులను సృష్టించిందని అన్నారు. ఈ ఒప్పందంపై దేశాన్ని తప్పుదోవ పట్టించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఒప్పందంతో మన దేశ వ్యవసాయ, పశు సంవర్ధక, పాడి పరిశ్రమల ప్రయోజనాలను ప్రధాని మోదీ పరిరక్షించారని అన్నారు. నరేంద్ర మోదీ, ట్రంప్ మధ్య ఉన్న సత్సంబంధాల వల్లనే రెండు దేశాల మధ్య ఈ వాణిజ్య ఒప్పందం కుదిరిందని అన్నారు. సుంకాల తగ్గింపు ప్రకటన ట్రంప్ నుంచి వచ్చిందని, వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన తుది వివరాలను ఖరారు చేశాక, సంయుక్త ప్రకటన విడుదల చేస్తామని అన్నారు.

## మణిపూర్ నూతన ముఖ్యమంత్రిగా మార్షల్ ఆర్ట్స్ నిపుణుడు ఖేమ్‌చంద్ సింగ్

**ఢిల్లీలో జరిగిన బీజేపీ శాసనసభాపక్ష సమావేశంలో కీలక నిర్ణయం**

**గతేడాది బీరేన్ సింగ్ రాజీనామాతో రాష్ట్రపతి పాలన విధింపు**

**ఫిబ్రవరి 12తో ముగియనున్న రాష్ట్రపతి పాలన**

**హింస తర్వాత గిరిజన ప్రాంతాల్లో పర్యటించిన తొలి మెయితీ నేతగా గుర్తింపు**




మణిపూర్‌లో ఏడాదిగా కొనసాగుతున్న రాజకీయ అనిశ్చితికి తెరపడింది. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా అసెంబ్లీ మాజీ స్పీకర్ యుమ్నామ్ ఖేమ్‌చంద్ సింగ్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో జరిగిన బీజేపీ శాసనసభాపక్ష సమావేశంలో ఆయనను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నట్లు పార్టీ ప్రకటించింది. రాష్ట్రంలో జాతుల మధ్య హింస ప్రజ్వరిల్లిన నేపథ్యంలో, అప్పటి ముఖ్యమంత్రి ఎన్. బీరెన్ సింగ్ రాజీనామా చేయడంతో గతేడాది ఫిబ్రవరి 13 నుంచి మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన అమల్లో ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా బీజేపీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయంతో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. మెజారిటీ మైతీ వర్గానికి చెందిన ఖేమ్‌చంద్ సింగ్, గతంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశారు. 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో సింగ్జమీ నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున గెలుపొందారు. ఖేమ్‌చంద్ సింగ్ శ్రీకృష్ణుని భక్తుడు. అంతేకాకుండా, సంప్రదాయ టేక్వాండో క్రీడలో 5వ డాన్ బ్లాక్ బెల్ట్ సాధించిన తొలి భారతీయుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. హింస చెలరేగిన తర్వాత ఇటీవల గిరిజన ప్రాబల్యం ఉన్న ఉఖ్రుల్, కమ్‌జోంగ్ జిల్లాల్లో పర్యటించిన తొలి మైతీ నేతగా ఆయన నిలిచారు. ముఖ్యమంత్రి ఎన్నిక ప్రక్రియ కోసం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్‌ను కేంద్ర పరిశీలకుడిగా నియమించింది. అధిష్ఠానం ఆదేశాలతో బీజేపీ, మిత్రపక్షాల ఎమ్మెల్యేలు ఢిల్లీకి చేరుకుని ఈ సమావేశంలో పాల్గొన్నారు. 60 మంది సభ్యులున్న మణిపూర్ అసెంబ్లీలో బీజేపీకి 37 మంది ఎమ్మెల్యేలు ఉండగా, మిత్రపక్షాలైన ఎన్పీపీకి ఆరుగురు, ఎన్పీఎఫ్‌కు ఐదుగురు ఎమ్మెల్యేల బలం ఉంది.

## ఎంఐఎం పార్టీలో విషాదం.. సీనియర్ నేత అహ్మద్ పాషా ఖాద్రీ కన్నుమూత

**హైదరాబాద్‌లోని ఓవైసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత**

**గత రెండేళ్లుగా కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న సీనియర్ నేత**

**చార్మినార్ నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన పాషా ఖాద్రీ**



హైదరాబాద్, ఫిబ్రవరి 3 : ఎంఐఎం పార్టీలో తీవ్ర విషాదం నెలకొంది. పార్టీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ నేత సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ (72) మంగళవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్‌లోని ఓవైసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. గత రెండేళ్లుగా అనారోగ్యంతో ఉన్న పాషా ఖాద్రీ, 2025 నవంబర్ 30న అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు ఆయన్ను ఓవైసీ ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్న ఆయన, పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం మరణించారు. అహ్మద్ పాషా ఖాద్రీకి ఏఐఎంఐఎం పార్టీలో ప్రత్యేక స్థానం ఉంది. ఆయన చార్మినార్ నియోజకవర్గం నుంచి వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2004, 2009, 2014, 2018 ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు సుల్తాన్ సలాహుద్దీన్ ఓవైసీకి అత్యంత సన్నిహితుడిగా, నమ్మకమైన సహచరుడిగా పేరుపొందారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు, యువ నాయకత్వానికి అవకాశం కల్పిస్తూ ఆయన యాకుత్‌పురా సీటు నుంచి తప్పుకున్నారు. దశాబ్దాలుగా పార్టీ జనరల్ సెక్రటరీగా కీలక బాధ్యతలు నిర్వర్తించిన పాషా ఖాద్రీ మరణంతో పాతబస్తీ రాజకీయాల్లో, ముఖ్యంగా ఎంఐఎం పార్టీలో తీరని లోటు ఏర్పడింది. ఆయన మృతి పట్ల పార్టీ శ్రేణులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

## నేడు తెలంగాణకు నితిన్ నబీన్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు తెలిపారు. అనంతరం అదే వేదికపై బహిరంగ సభ కూడా జరగనుందని ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న ఈ పర్యటన పార్టీకి కీలకంగా మారనుందని రాష్ట్ర బీజేపీ నాయకత్వం భావిస్తోంది. బూత్ స్థాయి కార్యకర్తలు, మున్సిపల్ నాయకులు, స్థానిక నేతలకు ఈ సమావేశం నూతన ఉత్సాహం, ప్రేరణను అందించనుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నితిన్ నబీన్ పర్యటన తెలంగాణ బీజేపీకి ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని రాంచందర్‌రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థాగత బలోపేతం, కార్యకర్తల మధ్య ఐక్యత పెంపు, ప్రజలతో పార్టీ అనుబంధాన్ని మరింత పటిష్టం చేయడమే ఈ పర్యటన ప్రధాన లక్ష్యమని తెలిపారు. మహబూబ్‌నగర్‌తో పాటు సమీప ప్రాంతాల ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ నాయకత్వం పిలుపునిచ్చింది.

## ప్రచారానికి మిగిలింది వారమే

మంత్రులు, స్థానిక నాయకులదేనని స్పష్టం చేశారు. మునిసిపల్ ఎన్నికలపై వారం రోజుల పాటు పూర్తిగా దృష్టి సారించాలని సీఎం రేవంత్ సూచించారు. ముఖ్యంగా నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లు, ఆదిలాబాద్, మెదక్ మునిసిపాలిటీల్లో మరింత శ్రమించాల్సిన అవసరం ఉందన్నారు. ఇకపై రెండురోజులకోసారి జూమ్ సమావేశాల ద్వారా ఎన్నికల పరిస్థితిని సమీక్షించనున్నట్లు తెలిపారు. సమీక్షలో బీసీ రిజర్వేషన్లపై కూడా చర్చ జరిగింది. వార్డులు, డివిజన్లలో సుమారు 56 శాతం మేర బీసీలకు కేటాయింపులు చేసినట్లు లెక్క తేలింది. అలాగే రెబెల్ అభ్యర్థుల సమస్యను చాలా వరకు నియంత్రించినట్లు పార్టీ అంచనాకు వచ్చింది. ఈ బెడద 12 శాతం లోపే ఉంటుందని భావిస్తూ, టీపీసీసీతో సమన్వయం చేసుకొని పూర్తిగా అదుపులో పెట్టాలని సీఎం సూచించారు. మునిసిపల్ ఎన్నికలు లేని జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నేతలను పరిశీలకులుగా నియమించాలని కూడా సమావేశంలో నిర్ణయించారు. గ్రేటర్ హైదరాబాద్, వరంగల్ వంటి జిల్లాల నేతలను ఎన్నికలు జరుగుతున్న మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు పంపనున్నారు.

## నేనేం పాపం చేశాను?

ఆ జాబితాను పక్కనపెట్టి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేను కూర్చోబెట్టుకొని అభ్యర్థుల ఎంపిక జరిగిందని ఆరోపించారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తమను, పరిస్థితులు మారగానే పక్కన పెట్టారని అన్నారు. జీవితంలో కాంగ్రెస్ జెండా పట్టని వారికి బీఫామ్‌లు కట్టబెట్టారని జీవన్‌రెడ్డి విమర్శించారు. తాను నిబద్ధత గల నాయకుడిగా కేసీఆర్‌పైనా పోటీ చేశానని గుర్తు చేశారు. గాంధీభవన్‌లో జరిగిన అంతర్గత సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హాజరుపై ప్రశ్నించానని, ఆ విషయంపై అభ్యంతరం ఉంటే తనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే కార్యకర్తలపై కోపం చూపడం సరైంది కాదన్నారు. పార్టీ నిబంధనలను ఎవరు ఉల్లంఘిస్తున్నారో స్పష్టంగా చెప్పాలని జీవన్‌రెడ్డి కోరారు. ప్రస్తుతం ఇది కాంగ్రెస్‌ను నమ్ముకున్న కార్యకర్తలు, వలసవాదుల మధ్య జరుగుతున్న పోటీగా అభివర్ణించారు. తాను జెండా మోసిన వారికే అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. చివరగా ప్రజలే న్యాయనిర్ణేతలని పేర్కొన్న జీవన్‌రెడ్డి, ఎవరు నిజమైన కాంగ్రెస్, ఎవరు కాదన్నది ప్రజలకు తెలుసన్నారు. కార్యకర్తల కోసం ప్రజల్లోకి వెళ్లి పోరాడుతానని తెలిపారు.

## అమెరికాతో వాణిజ్య ఒప్పందం.. ప్రధాని మోదీకి సన్మానం

ప్రధాని మోదీ ఎంపీలకు దిశానిర్దేశనం చేశారు. కాగా, భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందానికి ఇరు దేశాలు అంగీకరించిన విషయం తెలిసిందే. భారత్‌పై ప్రతీకార సుంకాలను 18 శాతానికి తగ్గిస్తున్నామని ట్రంప్ వెల్లడించారు. ట్రంప్ ప్రకటనతో ఇప్పటిదాకా భారత్ ఉత్పత్తులపై 50 శాతం సుంకం ఉండగా ఇప్పుడు అది 18 శాతానికి తగ్గుతుంది. ఈ 50 శాతంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు 25 శాతం అదనపు సుంకం కూడా ఉంది. ఇప్పుడు అదనపు సుంకాలను తొలగిస్తున్నట్లు అమెరికా తెలిపింది.

## లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తత... 8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్

ఎస్.వెంకటేశన్, డీన్ కురియకోస్ ఉన్నారు. “ప్రతిపక్షాలకు తమ గళం వినిపించే హక్కు ఉంది, కానీ నిరసన పేరుతో సభను పూర్తిగా స్తంభింపజేయడం, ప్రొసీడింగ్స్ జరగకుండా అడ్డుకోవడం పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధం“ అని దిలీప్ సైకియా వ్యాఖ్యానించారు. అంతకుముందు, సరిహద్దుల్లో చైనా ఆక్రమణల అంశంపై చర్చించాలంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన పుస్తకానికి సంబంధించిన ఓ మ్యాగజైన్ కథనాన్ని రాహుల్ ప్రస్తావించారు. అయితే, ధృవీకరించని వార్తా కథనాలను సభలో చదవకూడదని ప్యానెల్ స్పీకర్ సైకియా అభ్యంతరం తెలపడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రాహుల్ స్పందిస్తూ.. “మాట్లాడటానికి నాకు ఎవరి అనుమతి అవసరం లేదు. నేను ప్రతిపక్ష నాయకుడిని.. నాకు పర్మిషన్ అనే పదం వాడటం సరికాదు“ అని మండిపడ్డారు. తూర్పు లడఖ్‌లో ఘర్షణల వల్ల భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారని, దీనిపై ప్రధాని స్పందన ఏమిటని రాహుల్ ప్రశ్నించారు. ఈ సమయంలోనే అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం జరిగింది. విపక్ష సభ్యులు వెల్ లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. గందరగోళం మధ్యే సస్పెన్షన్ తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేశారు. టీడీపీ ఎంపీ జి.ఎం. హరీశ్ బాలయోగి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మాట్లాడేందుకు ప్రయత్నించినప్పటికీ, సభలో నిరసనల హోరు తగ్గకపోవడంతో ప్రసంగం కొనసాగలేదు.

# బడ్జెట్లో తెలంగాణకు మరోసారి మొండి చేయి

## కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు నవాబ్ ముజాహిద్ అలంఖాన్



హైదరాబాద్, ఫిబ్రవరి 03: వాయిస్ టుడే: కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు మరోసారి మొండి చేయి ఇచ్చిందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ నవాబ్ ముజాహిద్ అలంఖాన్ మండి పడ్డారు. మంగళవారం బర్కత్ పుర లోని ఆయన నివాసంలో మీడియా తో మాట్లాడుతూ... తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్యాలకు ఎలాంటి ప్రోత్సాహం ఇవ్వలేదు, హై స్పీడ్ రైలు, కారిడార్లు మినహా ఎలాంటి కేటాయింపు లేదు విభజన హామీలను కూడా పట్టించుకోలేదన్నారు. మెట్రో రెండోదశ, మూసి పునర్జీవనం, ట్రిబుల్ ఆర్ కు నిధులు కూడా కేటాయించలేదని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు అనేకసార్లు ప్రధాని మోదీని, కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర అవసరాలను వివరించినా ఫలితం లేకుండా పోయిందని ఆయన అన్నారు. వివిధ ప్రాజెక్టుల కోసం లక్ష 46 వేల కోట్లు అవసరమని ప్రతిపాదనలు ఇచ్చారు. రాష్ట్రం పంపిన ప్రతిపాదనలో ఈ ఆర్థిక సంవత్సరంలో కనీసం 50 వేల కోట్లు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారని తెలిపారు. అయినప్పటికీ కేంద్రం నుంచి ఒక్క పైసా కూడా రాలేదన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి అత్యంత కీలకమైన ప్రాజెక్టులను కేంద్రం తుంగలో తొక్కిందని విమర్శించారు. గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే, గోదావరి మూసి అనుసంధానికి ఒక్క రూపాయి కూడా రాలేదన్నారు. ఫ్యూచర్ సిటీ, వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వంటి పనులకు మొండి చేయి చూపిందన్నారు. ఐఐఎం, నవోదయ విద్యాలయాల కోసం విన్నపించిన ఫలితం లేదు గిరిజన వర్సిటీకి కొత్తగా నిధులు కేటాయించ లేదన్నారు. విద్యాసంస్థల అభివృద్ధికి ఆర్థిక సహకారం అందించాలన్న సీఎం రాష్ట్ర మంత్రుల విజ్ఞప్తులను కేంద్రం పెడచెవిన పెట్టింది, కానీ ఆంధ్రప్రదేశ్ లోని పోలవరం ప్రాజెక్టుకు దండిగా నిధులు కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుందని ఆయన అన్నారు. మన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు మాత్రం నయా పైసా కూడా ఇవ్వలేదని, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై 2014 నుంచి సాగుతున్న నిర్లక్ష్యం కొనసాగిందని, విభజన చట్టంలో ఉన్న ప్రధాన హామీలను కూడా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని ఆయన తెలిపారు.



# అభివృద్ధిలో అగ్రస్థానంగా సికింద్రాబాద్‌ను నిలిపాం: పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, ఫిబ్రవరి 03 (వాయిస్ టుడే ప్రతినిధి): సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో అగ్రస్థానంలో నిలుపుతున్నామని, అయితే ప్రభుత్వం తన ఎన్నికల హామీలు నెరవేర్చక పోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం బౌద్ధనగర్ డివిజన్ పరిధిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పద్మారావు గౌడ్ ప్రారంభించారు. అశోక్ నగర్, లలిత నగర్, శకుంతల స్కూల్, ఈశ్వరి బాయి నగర్, అంబర్ నగర్ ప్రాంతాల్లో రూ.94.20 లక్షల ఖర్చుతో సి.సి. రోడ్డు నిర్మాణం పనులు, బౌద్ధనగర్ కనకదుర్గ టెంపుల్ వద్ద రూ.55 లక్షల ఖర్చుతో నాలా బాక్స్ డ్రైన్ నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ పలు సందర్భాల్లో ప్రజల ఇబ్బందులు నివారించడంలో తాము ముందు ఉంటామని అన్నారు. బౌద్ధ నగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ మాట్లాడుతూ సికింద్రాబాద్ ఎం.ఎల్.ఏ. సహకారంతో బౌద్ధనగర్ లో వివిధ అభివృద్ధి పనులను పూర్తి చేశామని తెలిపారు. వివిధ శాఖల అధికారులు సువర్ణ లత, మాధవి, వేణు, ప్రియాంక, కార్పొరేటర్ సామల హేమ,, సమన్వయకర్త రాజ సుందర్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు. బౌద్ధనగర్ డివిజన్ పరిధిలో విస్తృతంగా పర్యటించిన సందర్భంగా పలు ప్రజా సమస్యల పై పద్మారావు గౌడ్ స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



# బాచుపల్లి స్మశాన వాటిక తొలగింపు అంశంపై మంత్రి శ్రీధర్ బాబు వినతి

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 3( వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బాచుపల్లి ప్రాంతంలో గత 50 సంవత్సరాలుగా కొనసాగుతున్న స్మశాన వాటికను తొలగించాలనే ప్రతిపాదనపై స్థానిక ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇటీవల ఏర్పడిన కొత్త కాలనీ నివాసులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ, స్మశాన వాటికను తొలగిస్తే సుమారు 50 వేల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామస్థులు తెలిపారు. అదేవిధంగా ఎంపీపీ మరియు మున్సిపల్ కార్పొరేషన్ కాలంలో ఈ స్మశాన వాటిక అభివృద్ధి కోసం నిధులు కూడా కేటాయించారు. ఈ నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఐటి ఒ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కలిసి సమస్యపై వినతి పత్రం సమర్పించారు. స్మశాన వాటిక అనేక సంవత్సరాలుగా ప్రజలకు ఉపయోగ పడుతోందని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దానిని కొనసాగించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు సంబంధిత అధికారులతో సమగ్రంగా పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, స్థానిక గ్రామ ప్రజలు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# ఘనంగా భౌరంపేట్ మల్లన్న జాతర

## ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బీఆర్ఎస్ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద ...

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 3( వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ భౌరంపేట్ లో జరుగుతున్న మల్లన్న జాతర లో రెండవ రోజు భాగంగా బీఆర్ఎస్ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ, గ్రామీణ సంప్రదాయాలు, జాతరలు ప్రజలను ఏకతాటిపై నిలిపే శక్తిగా పనిచేస్తాయని పేర్కొన్నారు. మల్లన్న స్వామి కృపతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భౌరంపేట్ పి ఏ సి ఎస్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ాం. సురేందర్ రెడ్డి పోలీస్ గోవింద్ రెడ్డి ధర్మారెడ్డి మురళీ యాదవ్ విష్ణువర్ధన్ రెడ్డి మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ అధ్యక్షులు పద్మారెడ్డి ఉపాధ్యక్షులు నాచారం సురేష్ యాదవ్ చింత మల్లేష్ ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధిశిసీఎంర్ఫ్‌రి చెక్కులను పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కంటెస్టెడ్ కార్పొరేటర్ కూన శ్రీనివాస్ గౌడ్



కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 3(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎనిమిది మందికి మంజూరైన సుమారు మూడు లక్షల విలువైన చెక్కులను అనారోగ్యం కారణంగా చికిత్స చేయించుకున్న సయ్యద్ సమ, మేరీ, గణేష్ గౌడ్, ఓం ప్రకాష్, వీరభద్ర రావు మంజూరైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకుడు కూన శ్రీనివాస్ గౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి శిసీఎంర్ఫ్‌రి అనేది నిరుపేదలకు ఆర్థిక అవసరాన్ని తీర్చే ఒక గొప్ప కార్యక్రమం అని తెలియజేశారు, నియోజకవర్గం పరిధిలో నిరుపేదలు అనారోగ్యం బారిన పడి చికిత్స చేయించుకున్నట్లయితే వాటికి సంబంధించిన రసీదులను తమ సిబ్బందికి అందజేసి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నిధులు మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# బహిరంగ ప్రదేశంలో చెత్త వేస్తే పరిణామం తప్పదు

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 3 ( వాయిస్ టుడే): దుండిగల్ సర్కిల్ పరిధిలో స్పెషల్ శానిటేషన్ లో భాగంగా సర్కిల్ కమిషనర్ ఎన్ వెంకటేశ్వర్ నాయక్ పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ లో భాగంగా డోర్ టు డోర్ నుండి వచ్చే చెత్తను తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందించే విధంగా అందరికి అవగాహన చేసినారు, గండి మైసమ్మ ఏరియాలో బిల్డింగ్ కన్స్ట్రక్షన్ మెటీరియల్ ఫుట్ పాత్ మీద పోసిన వారిని గుర్తించి 6000 రూపాయలు పెనాలిటి విధించడం జరిగింది.అదేవిధంగా సర్వే నం .120 ఏరియాలో రోడ్డు మీద చెత్త వేసిన వారిని గుర్తించి పెనాల్టీ విధించడం జరిగింది,యు పి ఎచ్ ఎస్ దొమ్మర పోచంపల్లి స్కూల్ పిల్లలకు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పైన డ్రైవింగ్ పోటీలను పెట్టారు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులతో సత్కరించరు ఈ కార్యక్రమంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూ. ఈ ఈ.అన్వేష్ రెడ్డి, ఎఈఈ అశోక్ కుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సాత్విక్, జవాన్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న స్థానిక కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 3( వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ లో వెలసిన 168 సంవత్సరాల చరిత్ర కలిగిన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి సేవలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ఆ వేణుగోపాలస్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు, అనంతరం ఆలయ కమిటీ వారు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి పురాతన చరిత్ర కలిగిన శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆశీస్సులు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని, నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయు ఆరోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఒ ధర్మకర్త ఠాకూర్ రాజేందర్ సింగ్, శ్రీరాములు గౌడ్, నల్ల లింగం గౌడ్, మనోహర్, లక్ష్మణ్, పులి బలరాం, నర్సింగ్ శిఎటిఎంరి మరియు స్థానిక డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

# 26 వార్డ్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా బి ఫ్రామ్ అందుకున్న నర్సింహా యాదవ్



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో...( వాయిస్ టుడే ప్రతినిధి):- భువనగిరి పట్టణం 26 వార్డ్ బహార్ పేట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గా నర్సింహా యాదవ్ కి భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి బిఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా వారు భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి కీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడు తు భారీ మెజారిటీ తో గెలుస్తా అని హామి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో పోత్నక ప్రమోద్ కుమార్ అవైస్ చిస్తీ తాంగేళ్లపల్లి రవి కుమార్ ఆదినారాయణ డాక్టర్ బారి ఈరపాక నర్సింహా ఇల్యాస్ కొత్త మల్లేష్ కౌసర్ సాయి శివ శరత్ సత్యం బాబు తదితరులు పాల్గోన్నారు.



భువనగిరి పట్టణం 35 వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ లకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా బిఫామ్ అందుకుంటున్న దృశ్యం.

– యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో(వాయిస్ టుడే ప్రతినిధి)

# ఓయూ భూముల్ని ఇతరులకు కేటాయించొద్దనీ ఏబీవీపీ ధర్నా



సికింద్రాబాద్, ఫిబ్రవరి 03 (వాయిస్ టుడే ప్రతినిధి): ఉస్మానియా యూనివర్సిటీ కీ సంబంధించిన హబ్సిగూడ లోని భూమి ని యూనివర్సిటీ అధికారులు బయటి వ్యక్తులకు కట్టబెట్టడాన్ని నిరసిస్తూ మంగళవారం ఎబివిపి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షులు గెల్లు శేఖర్, కార్యదర్శి మోక్షిత్ లు మాట్లాడుతూ యూనివర్సిటీ భూములను కాపాడవలసిన అధికారులే ఇతరులకు కట్టబెట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇప్పటికే వందల ఎకరాల యూనివర్సిటీ భూమి అన్యక్రాంతం అయిందని అన్నారు. ఇప్పుడు వాడుకొమ్మని ఇస్తారు కొన్ని సంవత్సరాలు తర్వాత వారు ఈ భూమి తమదే అని కబ్జా చేసే ఆస్కారం ఉందని అన్నారు. ఇలానే చాలా చోట్ల యూనివర్సిటీ భూమి అన్యక్రాంతమైందని గుర్తు చేశారు. కాబట్టి వెంటనే యూనివర్సిటీకి సంబంధించిన ఇంచు భూమిని కూడా బయట వ్యక్తులకు ఇవ్వవద్దని డిమాండ్ చేశారు. వెంటనే యూనివర్సిటీ అధికారులు తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాల్లని, లేనిపక్షంలో ఎబివిపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. దీనితో అక్కడ చిన్నపాటి ఉద్రిక్త వాతావరణం ఏర్పడడంతో పోలీసులు విద్యార్థి నాయకులను అరెస్ట్ చేసి ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సిటీ సెక్రెటరీ పృద్వితేజ, విద్యానగర్ విభాగ్ కన్వీనర్ హరి ప్రసాద్, హైదరాబాద్ సిటీ జాయింట్ సెక్రెటరీ దినేష్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ అజయ్, వీరబాబు, విజయ్ సింగ్, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# భువనగిరి 14వ వార్డు కౌన్సిలర్‌గా తనకు ఒకసారి అవకాశం ఇవ్వండి

## – 14వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గుండెగల ఎల్లయ్య



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. (వాయిస్ టుడే ప్రతినిధి ):- భువనగిరి పట్టణం14వ వార్డు కౌన్సిలర్గా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని తన గుర్తు గ్యాస్ సిలిండర్ అని, ప్రతి ఒక్కరు సిలిండర్ గుర్తుపై ఓటు వేసి తనకు ఒకసారి అవకాశం ఇవ్వాలని 14వ వార్డు కౌన్సిలర్ గా పోటీ చేస్తున్న గుండెగళ్ళ ఎల్లయ్య ఓటర్లను అభ్యర్థించారు. గతంలో తన సతీమణి గుండెగల అంజమ్మ కౌన్సిలర్ గా ఉన్న సమయంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశానని, తనకు మరొక్కసారి అవకాశం ఇస్తే ఇంకా ఎంతో అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# బాచుపల్లి కాలనీలో శ్రీ శ్రీ ఎల్లమ్మ తల్లి 19వ వార్షికోత్సవ మహోత్సవ

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 3(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి కాలనీలో శ్రీ శ్రీ ఎల్లమ్మ తల్లి 19వ వార్షికోత్సవ మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా, సమృద్ధిగా ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, కొలన్ బాల్ రెడ్డి, సిద్ధునోల సంజీవ్ రెడ్డి, వన్నీరు గణేష్, మైసిగారి శ్రీనివాస్, నరేందర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



వాయిస్ టుడే
హైదరాబాద్
బుధవారం 4 ఫిబ్రవరి 2026



## అన్యాక్రాంతమవుతున్న ఓయూ భూములను రక్షించాలి

### ఓయూ రిజిస్టర్‌కి ఏబీవీపీ విద్యార్థులు వినతి

సికింద్రాబాద్ ఫిబ్రవరి 03 (వాయిస్ టుడే ప్రతినిధి): హబ్సిగూడలో మసీదు పక్కన గల ఓయూ భూమిని ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేస్తున్నా ఓయూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, వెంటనే నిర్లక్ష్యాన్ని వదిలి ఓయు భూముల్ని కబ్జాకు ప్రయత్నిస్తున్న వారి పై చర్యలు చేపట్టాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఏబీవీపీ ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో యూనివర్సిటీ భూములను పరిరక్షించాలని రిజిస్టర్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హబ్సిగూడ లోనీ మసీదు పక్కన గల ఓయూ భూమి 300 గజాలు దాదాపు వందల కోట్ల ఖరీదు గల భూమిని ప్రైవేట్ వ్యక్తులు కబ్జాకు గురిచేసి చదును చేసుకుని వాళ్ళ అవసరాల కోసం వినియోగిస్తున్నా.. విషయం తెలిసిన అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడం నిజంగా బాధాకరమన్నారు. ఇప్పటికే ఓయూ అధికారుల నిర్లక్ష్యం వల్ల వందల ఎకరాల భూములు ప్రైవేట్ వ్యక్తులు కబ్జా కు గురై అన్యాక్రాంతం అయిన పరిస్థితన్నారు. అయినా కూడా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం నిజంగా సిగ్గుచేటనీ అన్నారు. యూనివర్సిటీ అధికారుల అండదండలతో ప్రైవేట్ వ్యక్తులు యూనివర్సిటీ భూములను కబ్జాకు గురిచేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అధికారుల నుండి ఎలాంటి చర్యలు లేకపోవడం విడ్డూరకరమన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంచు భూమిని కూడా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడితే ఊరికినే ప్రసక్తే లేదనీ, యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం ఏబీవీపీ ఏందాకైనా ఉద్యమిస్తుందన్నారు. అధికారులకు తగిన గుణపాఠం చెప్తుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం యూనివర్సిటీ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి, బయట వ్యక్తుల కబ్జాకు గురికాకుండా యూనివర్సిటీ ని క్లోజ్డ్ క్యాంపస్ చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుందన్నారు.



## ఖబర్దార్ సాయిజెన్ శేఖర్ దౌర్జన్యాలు మానుకో

### కార్పొరేటర్ భర్తను వెంటనే అరెస్ట్ చేయాలి

నాచారం (వాయిస్ టుడే ):నాచారం డివిజన్ స్థానిక కార్పొరేటర్ భర్త ఆకృత్యానికి, అసహనానికి, ప్రజలలో రోజురోజుకు వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక బిజెపి నాయకులు గోపాల్ గౌడ్ కి పెరుగుతున్న ప్రజా ఆధరణను జీర్ణించుకోలేక చేస్తున్న దాడులను వ్యతిరేకిస్తూ గోపాల్ గౌడ్ కి మద్దతుగా, సంఘీభావం తెలపటానికి గోపాల్ గౌడ్ నివాసానికి విచ్చేసిన ఉప్పల్ నియోజకవర్గం బిజెపి నాయకులు కార్యకర్తలు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ కు వెళ్లి దాడి చేసి దూర్భాషలాడిన వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ అధికారులను కోరిన ఉప్పల్ నియోజకవర్గం బిజెపి నాయకులు.ఈ సందర్బంగా ఉప్పల్ కన్వినర్ దేవసాని బాలచందర్, రైల్వే బోర్డు మెంబర్ లక్ష్మణ్ గౌడ్,రవీంద్ర సాగర్,నాదం,మల్కా ప్రకాష్ మాట్లాడుతూ అధికార గర్వంతో విర్రవీగుతూ నోటికి హద్దు లేకుండా విచక్షణ కోల్పోయి ప్రవర్తిస్తున్న సాయిజెన్ శేఖర్ ఆగడాలను అరికట్టాలని, పోలీస్ యంత్రాంగం సాయిజెన్ శేఖర్ పై తగిన చర్యలు తీసుకోవాలని న్యాయంగా వ్యవహారించాలని అధికార ఒత్తిళ్లకు లొంగకుండా నిస్పక్షపాతంగా వ్యవహారించాలని పోలీస్ అధికారులను కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, లక్ష్మణ్ గౌడ్, నాదం, అంబటి వెంకటాచలం, శ్రీధర్, శాంతి కిరణ్,రవీంద్ర సాగర్, రాంప్రదీప్,సత్తిబాబు,రాంచందర్,నాచారం డివిజన్ బిజెపి నాయకులు మల్కా ప్రకాష్ ఉదయ్ రెడ్డి, చంద్రమౌళి, రాజిరెడ్డి,మోహన్ రెడ్డి, అభిషేక్,అన్వర్,ప్రతాప్ రెడ్డి,కిషోర్, శ్రీనివాస్ యాదవ్,మంజులవాణి, అరుణ,కళావతి లావణ్య, పార్వతి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లిటిల్ ఫ్లవర్ హై స్కూల్‌కు 5 స్టార్ రేటింగ్

### స్కూల్ ప్రిన్సిపల్ బ్రదర్ ఆంటోనీ



హైదరాబాద్, ఫిబ్రవరి 03: వాయిస్ టుడే : ఆబిడ్స్ లోని లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ కు ఇండియా స్టార్ రేటెడ్ స్కూల్ ఆఫ్ ఇండియా 2025 గుర్తింపు కింద ప్రతిష్టాత్మకమైన 5 స్టార్ రేటింగ్ లభించిందని ప్రిన్సిపల్ బ్రదర్ ఆంటోనీ పి తెలిపారు. అదేవిధంగా ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను విద్యారంగ అభివృద్ధి, పాఠశాల సంస్కృతి, ఆదర్శప్రాయమైన ప్రయత్నాలను, గుర్తించి ఈ సంస్థకు మార్గదర్శకులు అనే మరో అవార్డు లభించిందని ఆయన పేర్కొన్నారు. ప్రిన్సిపల్ బ్రదర్ ఆంటోనీ పి తరపున ఈ అవార్డును ప్రముఖ విద్యావేత్త డాక్టర్ ప్రియదర్శిని, డాక్టర్ కునాల్ ఆనంద్, శ్రీ గోయాంకాల చేతులు మీదుగా సీనియర్ ఫ్యాకల్టీ కే సంపత్ కుమార్ అందుకున్నారు. ఈ మేరకు మంగళవారం అబిడ్స్ లోని లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ప్రిన్సిపాల్ బ్రదర్ ఆంటోనీ పి, సీనియర్ ఫ్యాకల్టీ కే సంపత్ కుమార్ లు అవార్డుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈనెల 1వ తేదీన న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో 5 స్టార్ రేటింగ్ అవార్డు తమ లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలకు రావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. తమ పాఠశాలలో విద్యా నైపుణ్యం, స్థిరమైన అభివృద్ధి, పట్ల తమ పాఠశాల, నిబద్ధతతో విద్యార్థులకు మెరుగైన విద్యను బోధిస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నామన్నారు. ఈ అవార్డు తమ పాఠశాలకు రావడం తమ బాధ్యతను మరింత గుర్తు చేస్తుందన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని అవార్డులను సాధించేందుకు తాము కృషి చేస్తామన్నారు. ఈ పాఠశాలలో, కరస్పాండెంట్ బ్రదర్ జే కప్, బ్రదర్ అపోలీ డిసోజా, ఉపాధ్యాయుల సమిష్టి కృషితో ఈ అవార్డు లభించడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు.

# ఓయూ వీసీతో డిప్యూటీ మేయర్ భేటీ

### ఓయూలో గల తొమ్మిది బస్తీల సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్చ....



హైదరాబాద్, ఫిబ్రవరి 03 (వాయిస్ టుడే ప్రతినిధి): దేశంలోనే ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థగా గుర్తింపు పొందిన ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో గత కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్న తొమ్మిది బస్తీల ప్రజల సమస్యలు మరోసారి చర్చకు వచ్చాయి. సోమవారం గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి లు ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మాలుగారం ను కలిసి బస్తీ ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని తొమ్మిది బస్తీల్లో నివసిస్తున్న ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా మంచినీటి సరఫరా లోపం, దెబ్బతిన్న రహదారులు, నిరంతర విద్యుత్ అంతరాయాలు, పక్కా గృహాల లేమి వంటి తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని ఈ సందర్భంగా వీసీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వాలు, అధికారులు మారుతు న్నప్పటికీ ఈ బస్తీల సమస్యలకు ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి ఉన్న చారిత్రక ప్రాధాన్యతను గుర్తు చేస్తూ, ఈ విశ్వవిద్యాలయం దేశ విద్యా రంగానికి అందిస్తున్న సేవలు అమూల్యమని పేర్కొన్నారు. అయితే, యూనివర్సిటీ ప్రాంగణంలోనే ఇన్నేళ్లుగా కొనసాగుతున్న ఈ బస్తీల సమస్యలు విద్యా వాతావరణానికి, యూనివర్సిటీ అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులకు తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం అవసరం అని డిప్యూటీ మేయర్ స్పష్టం చేశారు. ఈ తొమ్మిది బస్తీలు కలిపి సుమారు 72 నుంచి 80 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్నాయని, దీని వల్ల యూనివర్సిటీ భద్రత, విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమాలు ప్రభావితమవుతున్నాయని వివరించారు. ఈ సమస్యకు పర్మనెంట్ సొల్యూషన్‌గా, బస్తీ ప్రజలకు సమీప ప్రాంతంలోనే సుమారు ఐదు ఎకరాల స్థలంలో డబుల్ బెడ్‌రూమ్ పక్కా ఇళ్లను నిర్మించి పునరావాసం కల్పించాలని ప్రతిపాదించారు. ఇలా చేస్తే మిగిలిన సుమారు 70 ఎకరాల విలువైన భూమి పూర్తిగా ఉస్మానియా యూనివర్సిటీకి చెందుతుందని, యూనివర్సిటీ అభివృద్ధి అవసరాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఇన్నేళ్లుగా అక్కడే నివసిస్తున్న బస్తీ ప్రజలకు తగిన న్యాయం జరుగుతుందని, అదే సమయంలో యూనివర్సిటీ క్యాంపస్ సరిహద్దులు స్పష్టంగా ఏర్పడి భద్రత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం, ఉస్మానియా యూనివర్సిటీ యాజమాన్యం, జిహెచ్ఎంసీ సమన్వయంతో ఈ అంశంపై తక్షణ నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్ నగరానికి గర్వకారణం. ఇక్కడి అభివృద్ధికి అడ్డంకిగా మారిన సమస్యలను రాజకీయాలకు అతీతంగా, మానవతా దృక్పథంతో పరిష్కరించాలన్నారు. బస్తీ ప్రజలకు న్యాయం జరిగేలా, యూనివర్సిటీ భవిష్యత్ అవసరాలు దృష్టిలో ఉంచుకుని శాశ్వత నిర్ణయం తీసుకోవాలని అన్నారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మాలుగారం ఈ ప్రతిపాదనలను సానుకూలంగా స్వీకరిస్తూ, సంబంధిత ప్రభుత్వ శాఖలతో సంప్రదించి పూర్తి నివేదిక రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామని హామీ ఇచ్చారన్నారు. ఈ భేటీతో ఉస్మానియా యూనివర్సిటీలోని తొమ్మిది బస్తీల సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక అడుగు పడిందని బస్తీ వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో బీసీలకు 52 శాతం బీఫాంలు కేటాయించాలి

### జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గవ్వల భరత్ కుమార్...

సికింద్రాబాద్, ఫిబ్రవరి 03 (వాయిస్ టుడే ప్రతినిధి): రాబోయే మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 52 శాతం బీఫాం లు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గవ్వల భరత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం విద్యానగర్లోనీ బీసీ భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సర్పంచ్ ఎన్నికల్లో బీసీలు జనరల్ స్థానాల్లోనే 52 శాతం విజయం సాధించారని గుర్తు చేశారు. ఇది బీసీల రాజకీయ సామర్థ్యానికి, ప్రజాదరణకు నిదర్శనమని పేర్కొన్నారు. అయినా ఎన్నికలు వస్తే బీసీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం అన్యాయమని విమర్శించారు. దేశ జనాభాలో మెజారిటీ గా ఉన్న బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో అన్ని పార్టీలు విఫలమవుతున్నాయని ఆరోపించారు. మాటలకే పరిమితమయ్యే బీసీ హామీలు ఇకనైనా ఆచరణలోకి రావాలని అన్నారు. బీసీలకు బీఫాంలు కేటాయించకపోతే పార్టీలకు అతీతంగా బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీసీల రాజకీయ హక్కులు కాపాడాలంటే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల నుంచే న్యాయమైన ప్రాతినిధ్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. బీసీలకు 52 శాతం బీఫాం లు కేటాయించినప్పుడే ప్రజాస్వామ్యానికి అర్థం ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కంచిగారి ప్రవీణ్, బీసీ సంఘం గ్రేట్ హైదరాబాద్ అధ్యక్షులు అభిలాష్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ బిసి యువజన సంఘం అధ్యక్షులు విశాల్ పటేల్, బీసీ సంఘం మేడ్చల్- మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు సుమన్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాశ్యప్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పవర్ డైరీ-2026 ఆవిష్కరించిన ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్

### విద్యుత్ ఉద్యోగుల సేవలు రాష్ట్ర అభివృద్ధికి మూలస్తంభం అని ప్రశంస




జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 3 (వాయిస్ టుడే) : వెంగల్ రావు నగర్ డివిజన్ పరిధిలోని జీటీఎస్ కాలనీలో ఉన్న తెలంగాణ జెన్‌కో ఆడిటోరియంలో తెలంగాణ స్టేట్ పవర్ ఉద్యోగుల యూనియన్-1535 ఆధ్వర్యంలో నూతన పవర్ డైరీ-2026 ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ట్రాన్స్‌కో, జెన్‌కో విద్యుత్ అధికారులతో కలిసి డైరీతో పాటు క్యాలెండర్‌ను విడుదల చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేను యూనియన్ ప్రతినిధులు ఘనంగా స్వాగతించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ రంగం బలపడటానికి, ప్రజల రోజువారీ జీవనం సజావుగా సాగేందుకు నిరంతర విద్యుత్ సరఫరా ఎంతో కీలకమని అన్నారు. పట్టణాలు, గ్రామాల్లో ఎటువంటి అంతరాయం లేకుండా విద్యుత్ అందించేందుకు అధికారులు, సిబ్బంది రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్ర అభివృద్ధిలో విద్యుత్ ఉద్యోగుల పాత్ర అమూల్యమని ఆయన పేర్కొన్నారు. డైరీ ఆవిష్కరణ వేదికపై విద్యుత్ ఉద్యోగి, 2025 తెలంగాణ జానపద విభాగం నంది అవార్డు గ్రహీత సిద్దెల హుస్సేన్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌పై ప్రత్యేక గీతం ఆలపించి సభికులను అలరించారు. అనంతరం ఎమ్మెల్యే ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం, సేవా కార్యక్రమాల సమన్వయం, విధుల్లో మెరుగైన ప్రణాళిక కోసం పవర్ డైరీ ఉపయోగపడుతుందని తెలిపారు. ఉద్యోగుల మధ్య ఐక్యత పెంపొందించడంతో పాటు సంస్థల పనితీరును మరింత సమర్థవంతంగా చేయడంలో ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని జీటీఎస్ అధ్యక్షుడు కే. శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, ట్రాన్స్‌కో మరియు జెన్‌కో ఉద్యోగులు, ప్రైవేట్ మీటర్ రీడర్లు, చెపర్స్, సెక్యూరిటీ గార్డులు, స్టోర్ హమాలీలు, ఆర్టిజన్ కార్మికులు పాల్గొన్నారు. సెంట్రల్ కమిటీ ప్రెసిడెంట్ ఎం.ఏ. వజీర్, సెక్రటరీ డి. రాధాకృష్ణ, కంపెనీ ప్రెసిడెంట్ కే. ప్రమోద్ కుమార్, కంపెనీ సెక్రటరీ కీర్తి శ్రీనివాస్, కే. లింగం, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు హాజరయ్యారు.

# క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

### మెడికవర్ హాస్పిటల్స్...

### ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం వేళ సర్వైవర్ల విజయపథం"



సికింద్రాబాద్, ఫిబ్రవరి 03 (వాయిస్ టుడే ప్రతినిధి): ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ లోని మెడికవర్ హాస్పిటల్స్ ఆంకాలజీ విభాగం ఆధ్వర్యంలో యునైటెడ్ బై యునిక్ నినాదంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్యాన్సర్ నుంచి కోలుకున్న వారు (సర్వైవర్లు) ఈ కార్యక్రమంలో పాల్గొని, ప్రారంభ దశలో గుర్తింపు, సకాలంలో చికిత్స ఎంత ముఖ్యమో తమ అనుభవాల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డా. నివేద్ రావు బల్మూరి మాట్లాడుతూ భారతదేశంలో క్యాన్సర్ వ్యాప్తి పెరుగుతున్నదని తెలిపారు. "దేశంలో ప్రతి సంవత్సరం సుమారు 14 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయన్నారు. గణాంకాల ప్రకారం, ప్రతి తొమ్మిది మందిలో ఒకరికి జీవితకాలంలో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందనీ, అయితే క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే 50 శాతం కంటే ఎక్కువ కేసులు నివారించగలిగేవనీ, పూర్తిగా నయం చేయగలిగేవని పేర్కొన్నారు. ప్రారంభ దశలో గుర్తించిన క్యాన్సర్ కేసుల్లో 70 నుంచి 90 శాతం వరకు జీవన అవకాశాలు ఉంటాయని, అవగాహన లోపం కారణంగా చాలామంది రోగులు చివరి దశలోనే ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డా. గౌతమ్ మాట్లాడుతూ, "క్యాన్సర్ పై భయం, అపోహల కారణంగా చికిత్స ఆలస్యం అవుతోందన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కీమోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యునోథెరపీ వంటి ఆధునిక చికిత్సల ద్వారా ప్రారంభ దశలో మంచి ఫలితాలు సాధ్యమవుతాయని చెప్పారు.

**క్యాన్సర్‌ను జయించి.. మళ్ళీ జీవితాన్ని గెలిచి..**

కార్యక్రమంలో పాల్గొన్న క్యాన్సర్ సర్వైవర్లు తమ పోరాట అనుభవాలను పంచుకుంటూ, సకాలంలో వైద్యులను సంప్రదించడం, క్రమం తప్పకుండా చికిత్స తీసుకోవడం వల్లే తాము ఆరోగ్యంగా కోలుకున్నామని తెలిపారు. వారు కొత్తగా క్యాన్సర్ నిర్ధారణ అయిన రోగులకు అవగాహన కల్పించే 'ఫస్ట్ రెస్పాండర్స్'గా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రత్యేకంగా, ఈ కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ నుంచి కోలుకున్న సర్వైవర్లకు, వారి కుటుంబ సభ్యులకు మెడికవర్ హాస్పిటల్స్ ఫ్యామిలీ కార్డులను పంపిణీ చేశారు. ఇది చికిత్స అనంతరం కూడా రోగులకు నిరంతర వైద్య మద్దతు అందించాలనే ఆసుపత్రి ఉద్దేశం. ఈ కార్యక్రమం ద్వారా మెడికవర్ హాస్పిటల్స్ రోగి కేంద్రిత చికిత్స, వ్యాధి నివారణ, ప్రారంభ గుర్తింపు పట్ల తమ నిబద్ధతను మరోసారి చాటింది. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

# త్వరలో పూర్తి లక్ష్యం.. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి

## ఎయిమ్స్ బీబీనగర్ పనుల పురోగతిపై కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి సమీక్ష



యాదాద్రి–భువనగిరి జిల్లా, బీబీనగర్ : వాయిస్ టుడే: కేంద్ర పర్యాటక శాఖ మంత్రి మరియు తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి బీబీనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఎయిమ్స్ (AIIMS) క్యాంపస్‌ను సందర్శించి, జరుగుతున్న పనుల పురోగతిని అధికారులతో కలిసి సమీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పలు కీలక విషయాలను వెల్లడించారు. ఈ ఏడాది చివరి నాటికి ఎయిమ్స్ బీబీనగర్ హాస్పిటల్ నిర్మాణాన్ని పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. సుమారు 202 ఎకరాల విస్తీర్ణంలో, 750 పడకల సామర్థ్యంతో, అత్యాధునిక వసతులతో ఈ ఆసుపత్రి నిర్మాణం జరుగుతోందని చెప్పారు. మొత్తం రూ. 1,110 కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్న ఈ ప్రాజెక్ట్ తెలంగాణ ఆరోగ్య రంగానికి మైలురాయిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకొస్తూ అన్ని రకాల వైద్య సేవలను ఒకే చోట అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. దేశంలో అనేక గ్రీన్‌ఫీల్డ్ ఎయిమ్స్‌లు ఉన్నప్పటికీ, బీబీనగర్‌లో బ్రౌన్‌ఫీల్డ్ నమూనాలో నిర్మాణం జరుగుతుండటం ప్రత్యేకత అని అన్నారు. మెడికల్ విద్యార్థుల కోసం 24 అంతస్తులతో హాస్టల్ భవనాలు నిర్మాణంలో ఉన్నాయని, ఇప్పటికే వెయ్యికి పైగా సిబ్బందిని నియమించామని వెల్లడించారు. ఈ సంవత్సరం జనవరి 1 నుంచే ఎమర్జెన్సీ సేవలు ప్రారంభమయ్యాయని, ప్రస్తుతం ఎమర్జెన్సీ బ్లాక్‌లో 220 పడకలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఎయిమ్స్‌లో వైద్య పరిశోధన కార్యక్రమాలను మరింత విస్తరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు. ప్రస్తుతం ఇక్కడ 880 మంది విద్యార్థులు చదువుతున్నారని, అందులో 497 మంది వీడీదీూ, 146 మంది స్పెషలిటీ కోర్సులు, 142 మంది నర్సింగ్ విద్యార్థులు ఉన్నారని వివరించారు. అలాగే దీూష, మీూష నర్సింగ్ కోర్సులు కొనసాగుతున్నాయని తెలిపారు. రోగులు మరియు వారి సహాయకుల కోసం “అమృత్ నివాసం” పేరుతో ప్రత్యేక వసతి గృహాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతిరోజూ సుమారు 1,800 మంది ్రూ సేవలు పొందుతున్నారని వెల్లడించారు. నిర్మాణ పనులు కొనసాగుతున్నప్పటికీ వైద్య సేవలు ఎక్కడా అంతరాయం కలగకుండా నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు.

ఇప్పటివరకు ప్రాజెక్ట్‌పై రూ. 831 కోట్లు ఖర్చు చేయగా, మొత్తం పనుల్లో 86 శాతం పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. ఆయుష్మాన్ భారత్ మరియు ఆరోగ్యశ్రీ పథకాల కింద అర్హులైన వారికి పూర్తిగా ఉచిత వైద్యం అందించనున్నామని, ఇతరులకు కూడా నామమాత్రపు ఛార్జీలు మాత్రమే ఉంటాయని చెప్పారు. ఎయిమ్స్ పూర్తయిన తర్వాత తెలంగాణతో పాటు పరిసర రాష్ట్రాల ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఎయిమ్స్ సమీపంలో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, రూ. 450 కోట్లతో వీమీూ రెండో దశ ప్రాజెక్ట్ పూర్తయితే ఇక్కడ స్టాప్ ఏర్పాటు అవుతుందని తెలిపారు. స్థానిక సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. అధికారులు నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఆరోగ్య మౌలిక సదుపాయాల బలోపేతానికి కీలక ప్రాజెక్ట్‌గా ఎయిమ్స్ బీబీనగర్ రూపుదిద్దుకుంటుండటంతో, రాష్ట్రంలో వైద్య రంగం మరింత అభివృద్ధి చెందనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



## భద్రకాళి ఆలయం సందర్శించిన ఏపి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సతీమణి

వరంగల్ ( వాయిస్ టుడే ) ఫిబ్రవరి 03 : వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని మంగళవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా లెజ్నెవా సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన మంత్రి సతీమణికి ఆలయ ధర్మకర్తలు తౌనుపునూరి వీరన్న స్వాగతం పలికారు. ముందుగా ఆదిశంకరాచార్యులు, వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ స్నపన మండపంలో ముఖ్య అర్చకులు శ్రీ చెప్పెల వెంకటనాగరాజ శర్మ, వేదపండితులు ప్రదీప్ కుమార్ శర్మలు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు.ు



## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ.. ఆశా డే కార్యక్రమం

చీర్లవంచ, ఫిబ్రవరి 3 (వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత చీర్ల వంచ ప్రాథమిక ఆరోగ్య కేంద్రము ను ఆశా డే కార్యక్రమం లో భాగం గా మంగళవారం తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి తో పాటు సిబ్బంది తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఆశా కార్య కర్తలు విధిగా గర్భిణీ స్త్రీల నమోదు సకాలం లో చేసి వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించి, గర్భిణీ స్త్రీల చెకప్ తో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సాధారణ ప్రసవాలు ప్రోత్సహించాలని, జిల్లాలో సెక్స్ రేషియో తక్కువ గా ఉన్నందున బాలికల జననాలు ఎక్కువ గా జరుగు నట్లు ఆడపిల్ల అని తెలిసి అబార్షన్ చేసిన హాస్పిటల్ సమాచారం వెంటనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కి తెలియజేయాలని ఆశా కార్యకర్తలకు, సిబ్బందికి దిశా నిర్దేశించినారు. ఈ కార్యక్రమంలో చీర్లవంచ వైద్యాధికారి డాక్టర్ శరణ్య, సిహెచ్ఓ బాలచంద్రం, రాజు సిబ్బంది పాల్గొన్నారు.



## మున్సిపల్ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పకడ్బందీగా నిర్వహించాలి

### రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, ఐపీఎస్..

రాజన్న సిరిసిల్ల జిల్లా; ఫిబ్రవరి 3 (వాయిస్ టుడే): రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, ఐపీఎస్ మంగళవారం రోజు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, ఇతర పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్లు, పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, ఎన్నికల చట్టాలు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి పోలీస్ అధికారి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, నామినేషన్ ప్రక్రియ ప్రారంభం నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గతంలో ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడిన నేరస్తులు, ఎన్నికల వేళ నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తులు, పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులను బైండోవర్ చేయాలని సూచించారు. రాష్ట్ర పోలీసు లీగల్ అడ్వైజర్ ఏపూరి రాములు పోలీసు అధికారులకు మున్సిపల్ ఎన్నికల నిబంధనలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో చట్టాల అమలు, నిబంధనల పాటింపు ఉల్లంఘనలపై తీసుకోవాల్సిన చర్యలు వంటి అంశాలను వివరంగా వివరిస్తూ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే హాజరై మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా స్థాయిలో తీసుకుంటున్న చర్యల వివరాలను డీజీపీ కి తెలియజేశారు. ఈ సమీక్షా సమావేశంలో వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి, సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు కృష్ణ, వీరప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రవి, ఆర్ఐలు మధుకర్, యాదగిరి, రమేష్, ఎస్ఐలు కిరణ్, రామ్మోహన్, వినితా రెడ్డి తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 5 న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

### TSUTF జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్కాల రవిందర్, జంగిటి రాజు.




రాజన్న సిరిసిల్ల జిల్లా; ఫిబ్రవరి 03 (వాయిస్ టుడే): సీనియర్ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని, జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, పాఠశాలల మూసివేత, విలీనం నిలిపివేసి, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, కాంట్రాక్టు, తాత్కాలిక ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని తదితర డిమాండ్లతో ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్ ఆర్గనైజేషన్స్ (ూ× జీూజూ) పిలుపు మేరకు ఫిబ్రవరి 5న ఢిల్లీలోనీ జంతర్ మంతర్ వద్ద నిర్వహించే పార్లమెంట్ మార్చ్ కార్యక్రమశీ ను విజయవంతం చేయాలని ూఖుఖీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్కాల రవిందర్, జంగిటి రాజు లు కోరారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. చలో ఢిల్లీ, మార్చ్ టు పార్లమెంట్ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షుడు గుండమనేని మహేందర్ రావు, కోశాధికారి అంబటి రమేష్ , జిల్లా కార్యదర్శులు అదెపు శివ కుమార్, కోటగిరి లక్ష్మణ్, పొలాస మల్లేశం, పాముల స్వామి, కొత్వాల్ ప్రవీణ్,తిరుపతి జాదవ్, గాలిపెల్లి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.




## క్యాన్సర్ ను అంతం చేయడానికి అవగాహననే కీలకం

రాజన్న సిరిసిల్ల జిల్లా; ఫిబ్రవరి 03 (వాయిస్ టుడే ): రాజన్న సిరిసిల్ల జిల్లా లో క్యాన్సర్ ను అంతం చేయడానికి అవగాహన నే కీలకమని, ప్రారంభ దశ లో గుర్తించి చికిత్స తీసుకుంటే జీవన ఆశలు పెరుగుతాయని లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికర సంస్థ ఆధ్వర్యం లో జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ ఆదేశాల తో సీనియర్ సివిల్ జడ్జి/కార్యదర్శి, ఋూూ పి.లక్ష్మణాచారి సమన్వయం తో మంగళవారం అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం ను పురస్కరించు కొని సిరిసిల్ల పట్టణం లోని సుందరయ్య నగర్ లో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఋూూ, చీూఋూూ పథకాల ద్వారా ఉచిత న్యాయ సహాయం, చికిత్స సహాయం అందిస్తామని తెలిపారు. సదస్సులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డా.సాహితీ చింత, జూూ మెడికల్ ఆఫీసర్, న్యాయవాదులు ఆడెపు వేణు, బి.వాణి, ్రానవీ,ూచీవీలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షల ఒత్తిడి నివారణ, మానసిక ఆరోగ్య అవగాహన మత్తుపదార్థాలపై అవగాహన కార్యక్రమం

కోనరావుపేట, ఫిబ్రవరి 03 (వాయిస్ టుడే) : రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట రుద్రంగి మండలాల్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు పరీక్షల ఒత్తిడి నివారణ, మానసిక ఆరోగ్య అవగాహన, మత్తుపదార్థాల దుష్ప్ర భావాల పై అవగాహన కార్యక్రమం మంగళవారం విజయవంతం గా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం (ఋవీూ) నుండి డా. ప్రవీణ్ కుమార్ ముఖ్య వక్తగా పాల్గొని, పరీక్షల సమయంలో విద్యార్థులు ఎదుర్కొనే ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అవసరమైన సూచనలు, జీవనశైలి మార్పులు, సహాయం పొందే మార్గాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ఎక్సైజ్ శాఖకు చెందిన ఎస్.ఐ. సంతోష్, ఎస్.ఐ. నరేష్ పాల్గొని, మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాలను వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం సరైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యం పై అవగాహన పెరగడంతో పాటు, మత్తుపదార్థాల నివారణపై స్పష్టమైన సందేశం అందిందని కళాశాల అధ్యాపకులు తెలిపారు.



# 300 కోట్ల తో అభివృద్ధి చేసింది మేమే.. ఓటు అడిగే హక్కు మాదే

### వేములవాడ నియోజక వర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

### రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో శూన్యం; వేములవాడ అభివృద్ధి పై చల్మెడ సూటి ప్రశ్నలు



రాజన్న సిరిసిల్ల జిల్లా;ఫిబ్రవరి 03 (వాయిస్ టుడే): గత కేసీఆర్ ప్రభుత్వ హయాం లో వేములవాడ మున్సిపల్ పరిధిలో సుమారు 300 కోట్ల రూపాయలతో ఊహించని అభివృద్ధి జరిగిందని, అందుకే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు కేవలం బీఆర్ఎస్ పార్టీకే ఉందని వేములవాడ నియోజక వర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు స్పష్టం చేశారు. మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా కాలయాపన తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో 90 కోట్లతో గుడిచెరువు సుందరీకరణ, 47 కోట్లతో మిషన్ భగీరథ ద్వారా 9 వేల నల్లా కనెక్షన్లు, బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధికి 18.5 కోట్లు వెచ్చించిన ఘనత తమదేనని గుర్తుచేశారు. మిడ్ మానేరు నుండి పైపులైన్ ద్వారా గుడిచెరువును నిండుకుండలా మార్చామని, రైతు బజార్, మున్సిపల్ పార్కు వంటి ఎన్నో సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు.?కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు వస్తున్నాయని ఇప్పుడు రోడ్ల పనులు చేస్తూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోందని, వారి నిర్లక్ష్యం వల్ల పట్టణమంతా దుమ్ముతో నిండిపోయిందని మండిపడ్డారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గుడిని కూల్చడం తప్ప, ఎంత ఖర్చు చేశారు, ఏ అభివృద్ధి చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 11న జరిగే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ అసమర్థ పాలనకు తగిన బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో గూడూరు ప్రవీణ్, న్యాలకొండ అరుణ, పొలాస నరేందర్, సిరిగిరి చందు తదితరులు పాల్గొన్నారు.

## మాటంటే మాటే...
## గ్రామం కోసం మూడు గంటల భూమి విరాళం

**సైదాపూర్‌లో మాజీ ఉపసర్పంచ్ దాసరి రవీందర్ ఆదర్శం**



సైదాపూర్ (వాయిస్ టుడే): రాజకీయాల్లో హామీలు మాటలకే పరిమితమయ్యే రోజుల్లో, మాటను చేతలతో నిరూపించిన నాయకుడిగా మాజీ ఉపసర్పంచ్ దాసరి రవీందర్ నిలిచారు. సైదాపూర్ మండలం గర్రెపల్లిలో గ్రామాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని ఆయన గ్రామపంచాయతీకి మూడు గంటల భూమిని విరాళంగా అందజేయడం విశేషంగా మారింది. నూతన సర్పంచిగా మాచ మల్ల శ్రీకాంత్ గెలుపొందితే గ్రామపంచాయతీకి రెండు గంటల భూమి ఇస్తానని ఇచ్చిన హామీని దాసరి రవీందర్ నిలబెట్టుకున్నారు. అయితే గ్రామపంచాయతీ అవసరాల పరిశీలనకు వచ్చిన ఏఈ, రెండు గంటల భూమి సరిపోదని సూచించడంతో---హామీకి మించి ఆలోచించిన రవీందర్ అదనంగా గుంటదనం జోడించి మొత్తం మూడు గంటల భూమిని విరాళంగా ప్రకటించారు. ఈ చర్య గ్రామాభివృద్ధిపై ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనంగా నిలిచిందని గ్రామస్తులు చెబుతున్నారు. "మాట చెప్పడమే కాదు... మాట నిలబెట్టుకోవడమే నాయకత్వం" అన్నట్లు దాసరి రవీందర్ చేసిన ఈ విరాళం గర్రెపల్లిలో చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మాచ మల్ల శ్రీకాంత్, ఉపసర్పంచ్ కొడగాని వీరేశం, గర్రెపల్లి బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దోకిడి తిరుపతి, కొడగాని హరీష్, కె. సారయ్య, వి. సారయ్యతో పాటు పలువురు నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి వ్యక్తిగత త్యాగాలే బలమని, దాసరి రవీందర్ చేసిన భూమి విరాళం భవిష్యత్ తరాలకు ఆదర్శమని వారు పేర్కొన్నారు.



## ఎన్నికల ప్రచార ఖర్చులు పకడ్బందీగా నమోదు చేయాలి

**జిల్లా మున్సిపల్ ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజ్ కుమార్**


రాజన్న సిరిసిల్ల జిల్లా;ఫిబ్రవరి - 03 (వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా మున్సిపల్ ఎన్నికలను నేపథ్యంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల వ్యయాలపై పకడ్బందీ గా పర్యవేక్షణ చేపట్టాలని వ్యయ పరిశీలకులు రాజ్ కుమార్ ఆదేశించారు మంగళవారం ఆయన సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల ను సందర్శించి, ఎన్నికల అధికారులు, సహాయ వ్యయ పరిశీలకులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా అభ్యర్థుల ఎన్నికల వ్యయాల నమోదు, లెక్కల నిర్వహణ, రోజువారీ వ్యయ నివేదికల సమర్పణ విధానం వంటి అంశాలపై సవివరంగా చర్చించారు. ఎన్నికల సమయంలో అభ్యర్థులు ఖర్చును నిబంధనల ప్రకారం నమోదు చేయాలని, వ్యయ రిజిస్టర్లు రోజువారీగా అప్డేట్ చేయాలని ఆయన సూచించారు. ప్రచార కార్యక్రమాలు, వాహనాల వినియోగం, ప్రచార సామగ్రి, సభలు, సమావేశాలు తదితర ఖర్చులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ సమన్వయం తో పనిచేసి అక్రమ ఖర్చులు, అనుమానాస్పద లావాదేవీలను గుర్తించాలని తెలిపారు. అభ్యర్థులకు ఎన్నికల వ్యయాలపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు, వారు సమయానికి ఖర్చుల వివరాలను సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ శిక్షణలో నోడల్ అధికారులు నవీన్ కుమార్, భారతి పాల్గొన్నారు.ద



## ఓదెల మల్లికార్జున స్వామిని దర్శించుకున్న నవ్వుల రారాజు ఆర్ఎస్ నంద

**ఘనంగా సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు**

చిగురుమామిడి, ఫిబ్రవరి 3 (వాయిస్ టుడే) : చిగురుమామిడి మండలంలోని ఉల్లంపల్లి, బొమ్మనపల్లి గ్రామ శివారులో వెలసిన ప్రసిద్ధ ఓదెల మల్లికార్జున స్వామిని ప్రముఖ హాస్య నటుడు, నవ్వుల రారాజుగా పేరుగాంచిన ఆర్ఎస్ నంద మంగళవారం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్, ధర్మకర్తలు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి సన్మానించారు. స్వామి దర్శనానంతరం ఆర్ఎస్ నంద మాట్లాడుతూ, "ఓదెల మల్లికార్జున స్వామి నా ఇష్టదైవం. స్వామిని కొలిచిన వెంటనే కొంగు బంగారంగా కోరిన వరాలను ప్రసాదించే దేవుడిగా నేను విశ్వసిస్తున్నాను. ఇలాంటి మహనీయ స్వామిని దర్శించుకోవడం నా జన్మ సుకృతంగా భావిస్తున్నాను" అని అన్నారు. అంతేకాక రాష్ట్ర ప్రజలందరూ పాడిపంటలతో సమృద్ధిగా ఉండాలని, సమయానికి వర్షాలు కురిసి రైతులు సుఖసంతోషాలతో జీవించాలని స్వామిని మనసారా ప్రార్థించినట్లు తెలిపారు. ఓదెల మల్లికార్జున స్వామి కృపతో రాష్ట్రానికి శుభకాలం రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, ధర్మకర్తలు, కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆర్ఎస్ నంద దర్శనంతో ఆలయ ప్రాంగణం భక్తి వాతావరణంతో పులకరించిపోయింది.





# విద్యా ప్రమాణాలు మరింత మెరుగ్గా ఉండాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**మల్లక్‌పల్లి ప్రధానోపాధ్యాయురాలికి షోకాజ్ నోటీసు**

**ధర్మసాగర్ మండలంలో పలు పాఠశాలల ఆకస్మిక తనిఖీ**

హనుమకొండ, వాయిస్ టుడే: పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రగతిలో మరింత మెరుగ్గా ఉండేవిధంగా ఉన్నత విద్యా ప్రమాణాలతో విద్యా బోధన సాగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం మల్లక్‌పల్లి,నారాయణగిరి లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా మల్లక్‌పల్లి లోని ఉన్నత పాఠశాలలోని పదో తరగతిని కలెక్టర్ సందర్శించారు. డిజిటల్ విధానంలో కొనసాగుతున్న తరగతిలో పాఠ్యాంశాల బోధన గురించి కలెక్టర్ పాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాల పరిసరాలు,పరిశుభ్రతను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు నిర్వహించిన స్లిప్ టెస్టుల గురించి ఆరా తీశారు. పాఠశాలకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రధానోపాధ్యాయురాలు నాగేశ్వరిని కలెక్టర్ అడిగారు. రికార్డుల నిర్వహణ సరిగ్గా లేకపోవడం,పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం,విద్యా ప్రమాణాలు తక్కువగా ఉండడం పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసి సదరు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుకు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని అక్కడే ఉన్న డీఈవో ఎల్.వి గిరిరాజ్ గౌడ్ ను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలకు చెందిన నాలుగు,ఐదు తరగతులను నిర్వహిస్తున్న తరగతి గదిని కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. వంట గదిని కలెక్టర్ పరిశీలించారు. ఈ రోజు మెనూ ఏంటి? ఏం వండారు? ఎంతమంది విద్యార్థులకు వంట చేశారు? అని మధ్యాహ్న భోజనం వండిన నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా అని కలెక్టర్ ఆరా తీశారు.

అనంతరం కలెక్టర్ మండలంలోని నారాయణగిరి లో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతి బాలికలు,బాలుర సెక్షన్లను జిల్లా కలెక్టర్ సందర్శించారు. బాలికల తరగతిలో నేచురల్ రిసోర్సెస్(సహజ వనరులు) అనే పాఠ్యాంశ బోధన సాగుతుండగా విద్యార్థినులను పాఠ్యాంశానికి సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల చేత పాఠ్యాంశాన్ని చదివించారు. విద్యార్థినులకు అప్పటికప్పుడే నేచురల్ రిసోర్సెస్ ఏంటి అనే ప్రశ్నకు జవాబులు రాయాలని చెప్పగా విద్యార్థినిలు సమాధానాలు రాశారు. విద్యార్థినులు రాసిన సమాధానాలను పరిశీలించిన కలెక్టర్ పదోతరగతి బాలుర సెక్షన్ ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ డాక్టర్ బి.రాధన్ ఉపాధ్యాయులతో పాఠ్యాంశాలు, విద్యార్థుల ప్రగతి సంబంధించిన అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఉపాధ్యాయుల డైరీని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు ఏ విధంగా రివిజన్ చేయిస్తున్నారని ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు బాగుండటంతో పాటు పదో తరగతి బాలికలు విద్యా ప్రగతి పై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులను చదువులో మరింత మెరుగుపరచాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాల పునశ్చరణ (రివిజన్) చేయించాలన్నారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో గిరిరాజ్ గౌడ్,ఎంఈవో డాక్టర్ బి.రాధన్,తహసిల్దార్ గుర్తికొండ సదానందం,ఎంపీడీవో కమటం అనిల్ కుమార్,మల్లక్‌పల్లి,నారాయణగిరి గ్రామాల సర్పంచులు గిన్నారపు లత,పుట్ట రేణుక తదితరులు పాల్గొన్నారు.




## ఆయిల్ పామ్ సాగుతో అధిక దిగుబడి దీర్ఘ కాలం పాటు ఆదాయం


**పంట సాగులో జిల్లా మరింత ముందడుగు.**

**ఒకే రోజు లో జిల్లా వ్యాప్తంగా 110 ఎకరాల్లో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమం.**

**ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలి: ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్.**

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 03 (వాయిస్ టుడే) : రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామం లో మెగా ప్లాంటేషన్ లో పాల్గొన్న ఇంచార్జి కలెక్టర్. మాట్లాడుతూ,ఆయిల్ పామ్ పంట సాగు ద్వారా రైతులు అధిక దిగుబడితో పాటు దీర్ఘకాలంపాటు అధిక ఆదాయా న్ని సాధించవచ్చని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని విస్తృతం గా నిర్వహించారు. మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామం లో నిర్వ హించిన కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులతో కలిసి ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భం గా రైతులతో మాట్లాడిన ఇంచార్జి కలెక్టర్, ఆయిల్ పామ్ పంటకు ప్రభుత్వ సహకారం, సబ్సిడీలు, మార్కెటింగ్ సదుపాయాలు, భవిష్యత్ లో వచ్చే ఆదాయం, తదితర అంశాలపై వివరించారు. మెగా ప్లాంటేషన్ లో భాగంగా ఈరోజు జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల్లో కలిపి మొత్తం 32 మంది రైతుల ద్వారా 110 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకుని, ప్రణాళిక ప్రకారం విజయవంతంగా పూర్తి చేశామని వెల్లడించారు. ఆయిల్ పామ్ పంట సాగు ఆవశ్యకతను, అధిక దిగుబడి, లాభాలను తెలుసుకుని ఆసక్తితో ముందుకు వచ్చిన రైతులను ఇంచార్జి కలెక్టర్ అభినందించారు. ఆయిల్ పామ్ సాగుకు ఇక్కడి రైతులు తీసుకున్న నిర్ణయం ఇతర రైతులకు ఆదర్శంగా నిలవాలని, మీ అనుభవాలను పక్క గ్రామాల రైతులతో పంచుకుని ఆయిల్ పామ్ పంట సాగుపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. ఆయిల్ పామ్ పంటను సాగు చేసేం దుకు రైతులు ఆసక్తితో ముందుకు రావాలని, ఈ పంట అన్ని కాలాలకు అనుకూలంగా ఉంటుందని, నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి, ఆదాయం వస్తుందని వెల్లడించారు. జిల్లా లో ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణం పెంచేందుకు పీఏసీఎస్ లకు, ఉద్యానవన, వ్యవసాయ శాఖ ఏఓలకు, ఏఈవోలకు లక్ష్యం కేటాయించామని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు పై రైతులకు ఉద్యానవన, వ్యవసాయ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం, వివిధ ప్రాంతాల్లో ఆయిల్ పామ్ సాగుతో లాభాలు ప్రభుత్వ సహకారం, సబ్సిడీలు వివరిస్తూ.. కరపత్రాలు సిద్ధం చేసి పంపిణీ చేయించామని బోయిన పల్లి మండలంలో ఇప్పటికే సాగు చేసిన రైతులతో సమావేశాల్లో మాట్లాడించి.. అవగాహన కల్పించామని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావు పేట కు మన జిల్లా నుంచి గత నెల 19వ తేదీన ఆయిల్ పామ్ సాగు, ఫ్యాక్టరీ సందర్శన కు సుమారు 50 మంది రైతులను పంపించామని, సందర్శన అనంతరం ఆ రైతులు సాగుపై సంతృప్తి వ్యక్తం చేయడం తోపాటు ఆసక్తి చూపిస్తు న్నారని వెల్లడించారు. జిల్లాలో గత సంవత్సరం జూలై నుంచి ఇప్పటి దాకా 67 మంది రైతుల నుంచి 257 ఎకరాల్లో 110 టన్నులు ఆయిల్ పామ్ పంటను సేకరించడం జరిగిందని పేర్కొన్నారు. ఒక్కో టన్నుకు రూ.20,456 మద్దతు ధర ప్రస్తుతం ఉందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ఎక్కువ మంది కూలీలు అవసరం లేదని, నిర్వహణ ఖర్చు తక్కువ ఉంటుందని తెలిపారు. పంట విక్రయించేందుకు ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లాలోని నర్మెట్ట వద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఉందని వెల్లడించారు. మిగితా అన్ని పంటలతో పోలిస్తే దీని సాగుతో ఎన్నో లాభాలు ఉన్నాయని, అటవీ జంతువుల బాధ ఉండదని, పర్యావరణ సమస్యలతో ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. అంతర పంటలుగా కూరగాయలు, ఇతర పంటలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం వల్లంపట్ల గ్రామంలో 2022 సంవత్సరంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటి పంటను సాగు చేస్తున్న తీరును ఇంచార్జి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతును అడిగి సాగు వివరాలను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ ఫారూక్, వ్యవసాయ అధికారులు, ఉద్యానవన అధికారులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ కి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బండారి శ్యాం రాజీనామా



రాజన్న సిరిసిల్ల జిల్లా: ఫిబ్రవరి 03 (వాయిస్ టుడే) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బండారి శ్యాం బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు.సిరిసిల్ల మున్సిపల్ పదవ వార్డుకు బిఆర్ఎస్ టికెట్ ఆశించిన నాకు పార్టీలోని దడిదల శ్రావణ్ రావు తో పాటు మరికొంతమంది కలిసి టికెట్ ఇవ్వకుండా చేశారని ఆయన ఆరోపించారు. 17 ఏళ్ల పాటు బి.ఆర్.ఎస్ పార్టీ కోసం ఎల్లప్పుడూ నమ్మకంగా పని చేశానని, నమ్మక ద్రోహం చేశారంటూ శ్యాం ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఆలోచించి కార్యకర్తలు నాలాంటి నాయకులు పార్టీలో నుంచి బయటకు వెళ్లకుండా ఉండాలంటే బి ఆర్ ఎస్ పార్టీలో నమ్మకద్రోహం చేస్తున్న కొంతమంది నాయక ముఠాను పక్కకు పెట్టాలని లేనట్లయితే పార్టీ మనుగడ కష్టమని ఆయన పేర్కొన్నారు.



## మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

**భీమేశ్వర ఆలయంలో పూజలు**

రాజన్న సిరిసిల్ల జిల్లా; ఫిబ్రవరి 3 (వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో రానున్న మహా శివరాత్రి జాతర ఏర్పాట్లను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భీమేశ్వర ప్రధాన ఆలయానికి వచ్చే భక్తులు, వృద్ధులు, దివ్యాంగులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించే దుకు వీల్‌చైర్ సదుపాయం తో నూతనం గా ఏర్పాటు చేసే ర్యాంపును పరిశీలించారు.అలాగే లడ్డూ కౌంటర్, పార్కింగ్ ప్రాంతాలు, క్యూ లైన్లు, చలువ పందిళ్లు, టెంట్లు, వీఐపీ రోడ్డు, టాయిలెట్స్, శివార్చన స్టేజీ, నూతనంగా ఏర్పాటు చేయనున్న క్యూ లైన్లు, పార్వతీపురం ధర్మశాల రోడ్డుతోపాటు ఆలయ పరిసరాల్లోని వివిధ ప్రాంతాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పరిశీలించారు. భీమేశ్వర స్వామి వసతి గృహంలో ఏర్పాటు చేసిన ప్రోటోకాల్ కార్యాలయంలో రూ. 1000 వేద ఆశీర్వచనం, రూ.500 స్పెషల్ కోడ్, రూ. 300 స్పెషల్ దర్శనం టికెట్స్ అందుబాటులో ఉన్నట్లు అధికారుల ద్వారా తెలుసుకున్నారు.అనంతరం శ్రీ భీమేశ్వర స్వామివారిని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం స్వామివారి మండపంలో ఆలయ ఈవో శ్రీమతి ఎల్ రమాదేవి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డీఈలు శాంతయ్య, వరప్రసాద్, ఆలయ డీఈలు రఘు నందన్, మైపాల్ రెడ్డి, ఏఈలు జయకుమార్, శ్రావణ్ కుమార్, బ్రహ్మం అన్న, శ్రీనివాస్, ఆలయ అర్చకులు, వేద పండితులు మరియు ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

## టిఆర్ఎస్ పార్టీ నుంచి బహిష్కరించాలి.. పదవికి రాజీనామా చేయాలి

## నిరసనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిక..

## సుబేదారి పిఎస్‌లో ఎమ్మెల్యేపై ఫిర్యాదు





హనుమకొండ జిల్లా, వాయిస్ టుడే: బీఆర్ఎస్ పార్టీకి చెందిన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలో నిర్వహించిన సమ్మక్క--సారలమ్మ జాతర సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కరీంనగర్ పోలీస్ కమిషనర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ వరంగల్, హనుమకొండ జిల్లాల మైనారిటీ నాయకులు సోమవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట తీవ్ర ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసి కలెక్టరేట్‌ను ముట్టడించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా మైనారిటీ ఛైర్మన్ మీర్జా అజీజుల్లాహ్ బేగ్ మాట్లాడుతూ సమ్మక్క--సారలమ్మ జాతరలో గద్దపైకి అమ్మవారు రాకముందే హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తన కుటుంబంతో కలిసి గద్దపైకి ఎక్కడం వల్ల లా అండ్ ఆర్డర్ సమస్య ఏర్పడే ప్రమాదం ఉందని గ్రహించిన పోలీసులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాతరను శాంతియుతంగా నిర్వహించాలనే ఉద్దేశంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసులు ప్రోటోకాల్ ప్రకారం రావాలని కోరినప్పటికీ పోలీసుల సూచనలను పట్టించుకోకుండా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగి అనంతరం హుజురాబాద్ రహదారిపై కూర్చొని కరీంనగర్ పోలీస్ కమిషనర్‌పై వివాదాస్పదమైన అవమానకర వ్యాఖ్యలు చేశారని తెలిపారు.

ఆ వ్యాఖ్యలు ముస్లిం మైనారిటీల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని.. అవి పూర్తిగా అనుచితమైనవని మండిపడ్డారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను అగౌరవపరిచేలా ఉద్దేశపూర్వకంగా విద్వేష భావంతో మాట్లాడినందుకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మైనారిటీ నాయకులు డిమాండ్ చేశారు. అంతేకాకుండా బీఆర్ఎస్ పార్టీ ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని,ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో తన గెలుపులో మైనారిటీ ఓట్లు కీలక పాత్ర పోషించాయని మర్చిపోయి ఈ విధంగా వ్యవహరించడం బాధాకరమని వ్యాఖ్యానించారు. అనంతరం జిల్లా మైనారిటీ వైస్ ఛైర్మన్ ఏం.ఎ.షబ్బీర్ (తబ్బు) మాట్లాడుతూ బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా ప్రజల కోసం పోరాడాల్సిన నాయకుడు ప్రజా భద్రత బాధ్యతలు నిర్వర్తిస్తున్న పోలీస్ కమిషనర్‌పై ఈ స్థాయిలో కోపం చూపించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. ఇలాంటి వ్యక్తి ఎమ్మెల్యే పదవికి అనర్హుడని పేర్కొంటూ బీఆర్ఎస్ పార్టీ నుంచి వెంటనే బహిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ నిరసనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మైనారిటీ నాయకులు మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ ఛైర్మన్ మీర్జా అజీజుల్లాహ్ బేగ్,జిల్లా మైనారిటీ వైస్ ఛైర్మన్లు ఏం.ఎ. షబ్బీర్ (తబ్బు),ఎం.డి.బాఖి,జిల్లా మైనారిటీ జనరల్ సెక్రటరీలు వహీద్,బిలాల్ (బబ్లూ),మైనారిటీ నాయకులు ఎం.డి. షాకీర్,డాక్టర్ అక్బర్ షేక్,కాంగ్రెస్ నాయకులు ఎం.డి. సమద్,అబ్దుల్ సమీ, వహీద్,ఎం.డి.సజ్జా,అబ్దుల్ ఆసిమ్,సయ్యద్ అథర్,ముస్లిం మైనారిటీ కుల పెద్దలు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఏ ఎన్నిక వచ్చినా ప్రజలంతా కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారు



## భూమాఫీయా నాయకులు వస్తారు జాగ్రత్త

## దొంగలు ఎక్కడున్న దొంగలే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## చొప్పదండి ఎమ్మెల్యే,కరీంనగర్ డిసిసి అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం

కరీంనగర్, ఫిబ్రవరి 03(వాయిస్ టుడే): ఎన్నికలు ఏవీ అయినా కాంగ్రెస్ గెలుపు ఖాయం అని చొప్పదండి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం అన్నారు.సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం,చొప్పదండి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముత్యం శంకర్ తో కలిసి నగరంలోని వి-పార్క్ హోటల్ లో పత్రికా విలేకరుల సమావేశంలో డా.మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ఈనెల 11న జరగనున్న మున్సిపల్ మరియు కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 5వ తారీఖున ఉమ్మడి కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో నిర్వహించనున్న బహిరంగ సభకు హాజరుకానున్నారు. చొప్పదండి లోని గుమ్లాపూర్ గ్రామంలో మధ్యాహ్నం రెండు గంటలకు ముఖ్యమంత్రి బహిరంగ సభ నిర్వహించనున్నాము.పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన నిర్వహించే అవకాశం ఉంది.రానున్న మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రంలో ప్రతి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలనే లక్ష్యంతో గత రెండు సంవత్సరాల నుండి మేము చేసిన అభివృద్ధి, సంక్షేమం మరియు రానున్న మూడు సంవత్సరాల్లో చేయనున్న అభివృద్ధి గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కరీంనగర్ జిల్లా ప్రజలతో సమావేశం కావడానికి నిర్ణయించుకున్నారు.ఈ సమావేశానికి మన జిల్లా ఇన్చార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్,అడ్లూరి లక్ష్మణ్ కుమార్,జిల్లా శాసనసభ్యులు, కార్పొరేషన్ చైర్మన్లు లైబ్రరీ చైర్మన్లు మార్కెట్ చైర్మన్ లు హాజరు కాబోతున్నారు.ముఖ్యంగా కరీంనగర్ జిల్లాకు సంబంధించి కరీంనగర్ కార్పొరేషన్ తో పాటు చొప్పదండి మున్సిపాలిటీ, హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలో చాలా స్పష్టంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయబోతున్నాం.ఏ సర్వే చూసినా జిల్లా ప్రజలు ఇవ్వనున్నారు. కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రానుంది.రాష్ట్రంలో కూడా ఇదే విజయ పరంపర కొనసాగుతుంది. 2023 శాసనసభ ఎన్నికల అప్పుడు ఆనాడు బిఆర్ఎస్ ను గద్దెదింపి కాంగ్రెస్ కు అధికారం కట్టబెట్టిన నాటినుండి ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం కొనసాగుతుంది. ఆ తర్వాత వచ్చిన పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సున్నా కు పరిమిత మయ్యింది.2023 ఎన్నికల అప్పుడు ఈ రాష్ట్ర ప్రజలు ప్రతిపక్ష పాత్ర ఇచ్చారు ప్రతిపక్ష పాత్ర వహించలేనటువంటి అసమర్థ స్థితిలో బిఆర్ఎస్ నాయకత్వం ఉంది, అసెంబ్లీ ఎన్నికల తర్వాత వచ్చిన కంటోన్మెంట్,జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మేము పెద్ద ఎత్తున విజయం సాధించాము.మేము గెలిచామని సర్వేలన్నీ మాకులంగా ఉన్నాయని మైండ్ గేమ్ ఆడిన హరీష్ రావు విఫలమయ్యారు. రాష్ట్రంలో ఏ ఎన్నిక వచ్చినా ప్రజలంతా కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారు.అందుకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలే నిదర్శనం.2023 డిసెంబర్ నుండి మా విజయ పరంపర కొనసాగుతుంది.ఎవరెన్ని కుట్రలు చేసినా ఎవరెన్ని డ్రామాలు చేసినా ఎవరెన్ని అబద్ధపు ప్రచారాలు చేసినా రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుంది. అందరికీ మాయొక్క విజ్ఞప్తి, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీలో చాలామంది దరఖాస్తు చేసుకున్నారు, ఆశించడం తప్పు కాదు నాయకత్వం కోరుకోవడం,పోటీ చేయాలనుకోవడం తప్పు కాదు కానీ పార్టీ ఒకసారి అభ్యర్థులను నిర్ణయించిన తర్వాత ఎవరైనా ఇండిపెండెంట్ ఉంటే వారందరూ ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎవరికైతే అధికారికంగా బీ ఫామ్ ఇస్తుందో వాళ్లందరికీ మద్దతు ఇవ్వాలని కోరుతున్నాము పార్టీ కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ కాపాడుకుంటుంది.కొంతమందికి ఏదైనా సందర్భంలో అవకాశం రాకపోతే వారందరూ నిరాశ పడకుండా పార్టీ మనందరిదిగా భావించి పార్టీ ఉంటేనే తెలంగాణ ప్రజలకు గాని ప్రజలకు కానీ మేలు కలుగుతుందని భావించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## మోడల్ స్కూల్ పాఠశాల సీట్ల దరఖాస్తుకు ఆహ్వానం



కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 03 (వాయిస్ టుడే):కొత్తపల్లి మండల కేంద్రంలోని ఎలగందల్ మోడల్ స్కూల్లో 6వ తరగతి మరియు7 నుండి 10 తరగతి వరకు మిగిలిపోయిన సీట్ల కొరకు ఆన్లైన్లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని,ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవడానికి ఫిబ్రవరి 28, 2026 చివరి తేదీ అని ఈ నెల 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోడిమ్యాల శ్రీనివాస్ తెలియజేశారు.ప్రైవేట్ పాఠశాలలకు దీటుగాఅన్ని సదుపాయాలు మరియు అంకిత భావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయ బృందం ఉన్న మోడల్ స్కూల్లో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కొరకు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తల్లిదండ్రులను కోరారు.

## 11వ డివిజన్‌లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి పండుగ స్వప్న-నాగరాజు ప్రచార హవా

### సేవే మార్గంగా,అభివృద్దే లక్ష్యంగా ప్రయాణం



కరీంనగర్,ఫిబ్రవరి 03 (వాయిస్ టుడే): నగరపాలక సంస్థ పరిధిలోని 11వ డివిజన్‌లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి పండుగ స్వప్న--నాగరాజు ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతోంది.డివిజన్ వ్యాప్తంగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు.డివిజన్‌లో గత కొంతకాలంగా నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ,రోడ్లు,పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల సమస్యలను గుర్తు చేస్తూ,గెలిచిన వెంటనే వాటికి శాశ్వత పరిష్కారాలు తీసుకువస్తామని హామీ ఇస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు డివిజన్ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేస్తున్నారు.ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది, యువత,మహిళలు,వృద్ధులు పెద్ద సంఖ్యలో మద్దతు తెలుపుతూ ఈసారి మార్పు ఖాయమని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.బీజేపీ బలపరిచిన అభ్యర్థిగా పండుగ స్వప్న--నాగరాజు గెలుపు దిశగా దూసుకెళ్తున్నారని డివిజన్ ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.



## ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలి

కోనరావుపేట, ఫిబ్రవరి 3 (వాయిస్ టుడే): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి హామీ పథకం పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మామిడిపల్లి సర్పంచ్ పన్నాల లక్ష్మారెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ఆయన ఉపాధి హామీ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రస్తుతం వ్యవసాయ పనులు లేని సమయంలో ఖాళీగా ఉండి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఈ పనులను కల్పిస్తోందని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా లభించే వేతనం గ్రామీణ కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో ఆసరాగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి కూలీ తమకు కేటాయించిన పనిని సక్రమంగా పూర్తి చేసి, ప్రభుత్వం అందించే సౌకర్యాలను పొందాలని సూచించారు,ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాసర్ల పవిత్ర, వార్డు సభ్యులు బీరయ్య, పంచాయతీ కార్యదర్శి సతీష్, ఫీల్డ్ అసిస్టెంట్ జవ్వాజి తిరుపతిగౌడ్ మరియు ఇతర గ్రామస్థులు, కూలీలు పాల్గొన్నారు



## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయం

### వేములవాడ పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్.

రాజన్న సిరిసిల్ల జిల్లా; ఫిబ్రవరి 03 (వాయిస్ టుడే) : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయం అని కాంగ్రెస్ పార్టీ వేములవాడ పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం వేములవాడ మున్సిపల్ పరిధి లోని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల జాబితాను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ఈ నెల 11 న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేస్తున్న అభివృద్ధి కి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. గత పది సంవత్సరాలుగా గత పది సంవత్సరాలుగా వేములవాడ పట్టణాన్ని ఏ మాత్రం అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రాజన్న ఆలయం అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. గతంలో బీజేపీ,బీఆర్ఎస్ పార్టీలకు అవకాశం ఇచ్చారని,గతంలో వారికి అవకాశం ఇస్తే వేములవాడ పట్టణ అభివృద్ధిని విస్మరించరని ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత చేసిన అభివృద్ధి పనులను బేరీజు వేసుకోవాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటు కాంగ్రెస్ పార్టీ కి వేయాలని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఉన్నారని వేములవాడ ఎమ్మెల్యే గా ఆది శ్రీనివాస్ మీకు అండగా ఉన్నారని మీ అమూల్యమైన ఓటును చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి 3: జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ వార్షిక ప్రయోగ పరీక్షలను పకడ్బందీగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు సజావుగా కొనసాగుతున్న నేపథ్యంలో మంగళవారం ఆయన ములకలపల్లి, అశ్వరావుపేట మండలాల్లోని పలు జూనియర్ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ములకలపల్లి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి ప్రయోగ పరీక్షల నిర్వహణ విధానం, ప్రయోగశాలల ఏర్పాట్లు, విద్యార్థుల హాజరు నమోదు, ప్రశ్నపత్రాల భద్రత తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం అశ్వరావుపేట మండలంలోని ఒక ప్రైవేట్ జూనియర్ కళాశాలను కూడా తనిఖీ చేసి పరీక్షలు నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నారా లేదా అన్న విషయాన్ని పరిశీలించారు. రెండవ రోజు నిర్వహించిన ప్రయోగ పరీక్షల హాజరు వివరాలను సమీక్షించిన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి, ఉదయం నిర్వహించిన పరీక్షలలో సాధారణ విభాగానికి కేటాయించిన 1,295 మందిలో 1,263 మంది హాజరుకాగా 32 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. వృత్తి విద్య విభాగానికి కేటాయించిన 1,386 మందిలో 1,207 మంది హాజరుకాగా 179 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. మొత్తం ఉదయం జరిగిన పరీక్షలకు 2,681 మందికి గాను 2,470 మంది హాజరై 211 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు.

అలాగే మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలలో సాధారణ విభాగానికి కేటాయించిన 880 మందిలో 861 మంది హాజరుకాగా 19 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. వృత్తి విద్య విభాగానికి కేటాయించిన 1,365 మందిలో 1,308 మంది హాజరుకాగా 58 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. మొత్తం మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 2,245 మందికి గాను 2,169 మంది హాజరై 77 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ, ప్రయోగ పరీక్షలు పూర్తయ్యే వరకు అన్ని పరీక్ష కేంద్రాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలని కళాశాల యాజమాన్యాలను ఆయన ఆదేశించారు.



## అంతర్జాతీయ పోటీలకు బధిర విద్యార్థులను సిద్ధం చేయండి

### జిల్లా యంత్రాంగం తరపున సహకరిస్తాం
### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

### "ఆలిండియా ఓవరాల్ ఛాంపియన్" సాధించిన బధిర విద్యార్థులకు అభినందన

కరీంనగర్, ఫిబ్రవరి 03 (వాయిస్ టుడే): అంతర్జాతీయ స్థాయిలో వివిధ పోటీల్లో పాల్గొనేందుకు ప్రభుత్వ బదిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులను సిద్ధం చేయాలని,అందుకు గల అవకాశాలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.గత నెల 29 నుండి ఈనెల 1 వరకు రౌండ్ టేబుల్ఇండియా సంస్థ ఆధ్వర్యంలో " ది సైలెంట్ ఒలంపియాడ్ -2026" పేరుతో ముంబైలో నిర్వహించిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కరీంనగర్ ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పాల్గొని ఆల్ ఇండియా ఓవరాల్ ఛాంపియన్ గా నిలిచారు. మొత్తం 28 మంది బంగారు, వెండి,రజత పతకాలు సాధించారు.ఈ సందర్భంగా కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు చక్కని ప్రతిభ చాటారని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో వివిధ దేశాల్లో జరిగే క్రీడా పోటీల్లోనూ ఈ విద్యార్థులు పాల్గొనేందుకు గల అవకాశాలనుపరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ స్థాయిలోనూ బధిర విద్యార్థులు రాణించేందుకు సంసిద్ధం చేయాలని,మరింత శిక్షణ ఇప్పించాలని అన్నారు. ఇందుకు జిల్లా యంత్రాంగం తరపున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, బదిరుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ జి.కమల ఉదయ కుమారి,ఉపాధ్యాయులు జే.తులసీరామ్,కె.శ్రీనివాస్ ఎన్.సుజాత, బి.అఖిల్,ఎం.రాజశేఖర్ పాల్గొన్నారు.

## బీజేపీలో ప్రతిజ్ఞా పర్వం

### గెలిచిన తరువాత పార్టీ వీడను
### బీజేపీలోనే ఉంటా... కరీంనగర్ ప్రజలకు అంకిత భావంతో సేవ చేస్తా



కరీంనగర్, ఫిబ్రవరి 03(వాయిస్ టుడే): అయారాం గయారాం సంస్కృతితో రాజకీయాలు కంపుకొడుతున్న ఈ తరుణంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కార్పొరేటర్ అభ్యర్థులతో గత రెండ్రోజులుగా వినూత్న రీతిలో ప్రతిజరు చేయిస్తున్నారు.గెలిచిన తరువాత పార్టీని వీడబోనని,పార్టీకి అంకిత భావంతో పనిచేస్తానని,కరీంనగర్ అభివృద్ధితోపాటు దేశం కోసం, సమాజం కోసం పనిచేస్తానని ప్రతిజరు చేయిస్తున్నారు. తొలిరోజు తొలిరోజు కిసాన్ నగర్,కాపువాడ మారుతీనగర్ చౌరస్తాలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగుల్లో 5 డివిజన్ల బీజేపీ అభ్యర్థులతో ప్రతిజరు చేయించిన బండి సంజయ్.కోతిరాంపూర్ చౌరస్తా,పాత లేబర్ అడ్డా వద్ద నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో 9,39.40, 62, 63, 64 డివిజన్లలో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థులతో ప్రతిజరు చేయించడం గమనార్హం.ఏమని ప్రతిజరు చేయించారంటే అనే నేను నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తానని, దేశం కోసం,సమాజం కోసం,ధర్మం కోసం పనిచేస్తానని, గెలిచిన తరువాత భారతీయ జనతా పార్టీలోనే కొనసాగుతానే తప్ప ఇతర పార్టీల్లోకి వెళ్లే ప్రసక్తే లేదని,నిరంతరం పార్టీ కోసం నిబద్ధతతో నిజాయితీతో అంకిత భావంతో పనిచేస్తానని దైవ సాక్షిగా,నాకు జన్మనిచ్చిన నా తల్లిదండ్రుల సాక్షిగా ప్రమాణం చేస్తున్నా అన్నారు.

## సింగరేణి కార్పొరేట్ ఎస్‌డపిసి నందు 4 రోజుల ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణా తరగతులు

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి 3: సింగరేణి వ్యాప్తముగా గల ఎస్‌డపిసి సెక్యూరిటీ గార్డులకు విడతల వారీగా నిర్వహించే ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణా తరగతుల లో భాగముగా మంగళవారం నుండి 06.02.2026 వరకు కొత్తగూడెం ఎస్‌డపిసి ట్రైనింగ్ సెంటర్ నందు నిర్వహించే 53 వ ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణా తరగతుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఏరియా సెక్యూరిటీ అధికారి/ ట్రైనింగ్ అధికారి యం.డి. జాకీర్ హుస్సేన్ హాజరై ఈ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంధర్భముగా ఏరియా సెక్యూరిటీ అధికారి/ ట్రైనింగ్ అధికారి యం.డి. జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ సెక్యూరిటీ సిబ్బంది అందరికీ క్రమశిక్షణ అనేది ముఖ్యం అని, మనం క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్నపుడే మనకు గుర్తింపు వస్తుందని, ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణ సెక్యూరిటీ సిబ్బంది అందరికీ అవసరం అని, ఈ శిక్షణ వలన డ్యూటీ జీవితం లోనే కాకుండా, వ్యక్తిగతంగా కూడా ఉపయోగకరమైనదని, ఈ నాలుగు రోజుల శిక్షణా కాలంలో ట్రాఫిక్ రెగ్యులేటరీ చట్టం, మాండేటరీ, కాషనరీ, ఇన్ఫర్మేటరీ సిగ్నల్స్, ట్రాఫిక్ పాయింట్ మన్ డ్యూటీస్, క్రౌడ్ కంట్రోల్ వంటి అంశాలపై అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీచే పూర్తి అవగాహన కలిగించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ వలన ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా, మెయిన్ గేటు వద్ద, చెక్ పోస్ట్ ల వద్ద రద్దీ లేకుండా సాఫీగా అందరు తమ విధులను సక్రమంగా నిర్వహించేందుకు దోహదం చేస్తుంది అని, యస్‌డ పిసి విభాగము పటిష్టంగా ఉండేందుకు కావలసిన అన్ని రకాల చర్యలు, యస్‌డ పిసి ట్రైనింగ్ సెంటర్ అభివృద్ధికి అన్ని రకాల సహాయ సహకారాలు యాజమాన్యం అందిస్తుంది అని, కావున సెక్యూరిటీ సిబ్బంది అందరు మెరుగైన వృత్తి నైపుణ్యంతో, అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ, సింగరేణి ఆస్తులు, స్థలాలను పరిరక్షించాలని, సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలి అని తెలిపారు. అనంతరం ట్రాఫిక్ యస్.ఐ ప్రవీణ్ కుమార్ మాండేటరీ, కాషనరీ, ఇన్ఫర్మేటరీ సిగ్నల్స్, డ్రైవర్ హ్యాండ్ సిగ్నల్స్, రోడ్డు భద్రతా నియమాల గురించి బోధించారు. ఈ కార్యక్రమంలో ఏరియా సెక్యూరిటీ అధికారి/ ట్రైనింగ్ అధికారి యం.డి. జాకీర్ హుస్సేన్ తో పాటు డి. నారాయణరెడ్డి, ట్రైనింగ్ ఇన్ స్పెక్టర్, ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.



## మిర్యాలగూడ గడ్డపై గులాబీ జెండా ఎగరవేయాలి

### మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు బడుగుల లింగయ్య యాదవ్

మిర్యాలగూడ ఫిబ్రవరి 3 (వాయిస్ టుడే ): మిర్యాలగూడ గడ్డపై గులాబీ జెండా ఎగరవేయాలని మాజీ శాసనసభ్యులు నలుగురు భాస్కరరావు మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ లు అన్నారు. మంగళవారంమిర్యాలగూడ పట్టణంలోని రెడ్డి కాలనీలో గల బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల సందడి నెలకొంది. ఎన్నికల బరిలో నిలవనున్న 42 మంది బిఆర్ఎస్ అభ్యర్థులకు పార్టీ అధికారికంగా బి-ఫారాలను అందజేసింది. మున్సిపాలిటీ ఎన్నికల సమన్వయకర్త, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు చేతులమీదుగా అభ్యర్థులకు ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో చేసిన అభివృద్ధి పనులే మనల్ని గెలిపిస్తాయని, ప్రత్యర్థి పార్టీల ప్రలోభాలకు లొంగకుండా, ప్రజల నమ్మకాన్ని కాపాడుకుంటూ విజయం దిశగా అడుగులు వేయండి, అని ఆయన అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలు ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లాలన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు మాట్లాడుతూ అభ్యర్థులందరూ సమన్వయంతో పనిచేసి గులాబీ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. మనం చేసిన అభివృద్ధి కళ్ళ ముందు కనిపిస్తోంది. ప్రతి గల్లీలోనూ, ప్రతి వార్డులోనూ మనం వేసిన రోడ్లు, చేసిన పనులే మన తరపున సాక్ష్యం చెబుతాయని.42 వార్డుల్లోనూ పార్టీ పటిష్టంగా ఉందని, విజయం మనదేనని నేతలు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు యడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, అన్నభిమోజు నాగార్జున చారి, చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, చిట్టిబాబు నాయక్, నల్లమోతు సిద్ధార్థ, దుర్గంపూడి నారాయణరెడ్డి, హతిరాం నాయక్, నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి, పాలుట్ల బాబయ్య, మట్టపల్లి సైదులు యాదవ్, కట్టా మల్లేష్ గౌడ్ చౌగాని బిక్షం గౌడ్, బాలాజీ నాయక్, కుర్ర శ్రీను నాయక్, అశోక్ రెడ్డి, మాజీ సింగల్ విండో చైర్మన్, బంటు శ్రీనివాస్, పోకల రాజు, జొన్నలగడ్డ రంగారెడ్డి, చిర్ర మల్లయ్య, నకిరేకంటి రాబర్ట్ అమరారపు తిరుమలేష్ పేరాల కృపాకర్ రావు, కౌన్సిలర్ అభ్యర్థులు, మాజీ కౌన్సిలర్లు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలపరిచిన సిపిఎం అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి






భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి 3 : కొత్తగూడెం జిల్లా కార్పోరేషన్ 21వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సిపిఎం పార్టీ అభ్యర్థి చింతలపూడి శ్రావణ గుర్తు స్తుతి కొడవలి నక్షత్రం గుర్తు పై మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని నాయకులు గూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సిపిఎం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూన్న కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నాగ సీతారాములు కాంగ్రెస్ పార్టీ కొత్తగూడెం మాజీ సోసైటి చైర్మన్ మండె వీర హనుమంతరావు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సిపిఎం పార్టీ 21వ డివిజన్ అభ్యర్థి చింతలపూడి శ్రావణి గెలుపు ను కాంక్షిస్తూ కాంగ్రెస్ సిపిఎం కార్యకర్తలు కష్టపడి పనిచేసే శ్రావణి ని గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వీర్ల రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వడుగు నరసింహారావు కొమారి రవీందర్ లింగం లక్ష్మయ్య దండు కృష్ణయ్య సట్టు ఆదినారాయణ బాలు నాగ వీరభద్రరావు బాలు నరసింహారావు చల్లా వెంకటేష్ చల్లా వీరయ్య మల్లిపెద్ది నాగరాజు మండే కొండయ్య లింగం వీర నాగేశ్వరరావు కందుల సాయి ఓర్సు రాములు సిపిఎం పార్టీ నాయకులు చింతాల శ్రీనివాసరావు నాగచందర్ బుడిగె హనుమంతరావు దండు నాగేశ్వరరావు లింగం నాగేందర్ పాండవుల సత్యనారాయణ రాజన్న దుర్గయ్య బుడిగె మధు గూని అప్పారావు లింగం రామారావు ఊరు పెద్ది రాము పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన సీఎం కప్ క్రీడా పోటీలు



సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా ఫిబ్రవరి-03 వాయిస్ టుడే : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ క్రీడా పోటీలు సుల్తానాబాద్ మండలం, మున్సిపాలిటీ స్థాయి పోటీలు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో దివ్యదర్శనరావు, మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, మండల విద్యాశాఖ అధికారి ఆరెపల్లి రాజయ్య, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ముస్త్యాల రవీందర్ హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువత శారీరకంగా దృఢంగా ఉండేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, సీఎం కప్ ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రతిభకు మంచి వేదిక లభిస్తోందని పేర్కొన్నారు. క్రీడలతో క్రమశిక్షణ, ఐక్యత పెరుగుతాయని తెలిపారు.ఈ పోటీల్లో వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, అథ్లెటిక్స్ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్ జి ఎఫ్ కార్యదర్శి తాండ్ర ప్రణయ్, ప్రకాష్ పెద్దన్న వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద్, సంధ్య, శ్రీవాణి, ఆసియా, సరోజ, స్వప్న,వెంకటేష్, మధుకర్, సంపత్, సత్యం, ఇక్బాల్, అజ్జు, రంజిత్, మమత విద్యార్థులు పాల్గొన్నారు.

## రేపటినుండి సీఎం కప్ పోటీలు



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 3 : నిర్మల్ సీఎం కప్ -2025 భాగంగా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఫిబ్రవరి 4 5 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి బి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు కబడ్డీ కోకో వాలీబాల్ అథ్లెటిక్స్ బ్యాడ్మింటన్ ఫుట్బాల్ క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు ఈ పోటీలు నిర్మల్లో ని కలెక్టరేట్ రోడ్ సమీప వాసవి వరల్డ్ స్కూల్ పక్కన ఉన్న మైదానంలో జరుగుతాయి అని పేర్కొన్నారు.



## కష్టపడ్డ వారికి పార్టీ గుర్తింపు లేదు

### - కాంగ్రెస్ కార్యకర్తల ఆవేదన
### - ఒకరు రాజీనామా మరొకరు పోటీలోంచి నిష్క్రమణ

రాయికల్(వాయిస్ టుడే): రాయికల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఇట్టి సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు బత్తిని నాగరాజ్ తమ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ భిపామ్ రానందుకు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు గత ఇరువై సంవత్సరాలుగా అనేక కష్టనష్టాలకు ఓర్చి పార్టీని కాపాడుకుంటూ వచ్చామని మా పార్టీలో మేమే పరాయి వాళ్ళం అయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు, అనంతరం మహిళా పట్టణ కాంగ్రెస్ నాయకురాలు మమత మాట్లాడుతు తాను కూడా పోటి నుండి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు, అనంతరం గత అనేక సంవత్సరాలుగా పార్టీని నమ్ముకున్న కార్యకర్తల బలంతో కాంగ్రెస్ పార్టీని కాపాడుకుంటూ వచ్చామని కష్టపడ్డ వారికే గుర్తింపు లేదని పార్టీతో సంబంధంలేని సభ్యత్వం కూడ లేని వ్యక్తులకు కాంగ్రెస్ పార్టీ భి ఫామ్ లు రావడంతో పూర్తిగా ఆవేదన చెందినట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మ్యకల రమేష్ తెలిపారు ఆయన కూడ పురపాలక ఎన్నికల పోటీలోంచి వైదోలుగుతున్నట్లు ప్రకటించారు,పార్టీని నమ్ముకున్న కార్యకర్తలను మోసం చేయడం సరికాదని జెండామోయని వారికి పట్టం కట్టడం పట్ల ఆయన ఆగ్రహ వ్యక్తం చేశారు. కాగ ఇటీవల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రభుత్వానికి మద్దతుగా ఉండగా ఆయన వర్గీయులు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరడంతో జీవన్ రెడ్డి వర్సెస్ సంజయ్ కుమార్ అన్నట్లుగా మారింది పరిస్థితి, కార్యకర్తలు పూర్తిగా సందిగ్ధంలో పడిపోయారు. అధిష్టానంతో రోజు రోజుకు కు పెద్దాయన కయ్యం పెరగడంతో పాటు సంజయ్ ఎమ్మెల్యే అనుచరుల కాంగ్రెస్ పార్టీలో బలం పెరగడంతో చివరకు నివ్వా నేనా అంటూ కొనసాగిన జగిత్యాల నియోజకవర్గ పురపాలక కాంగ్రెస్ పార్టీ బి ఫామ్ పోరులో ఎమ్మెల్యే అనుచరులు పై చేయి సాధించి అత్యధిక కాంగ్రెస్ పార్టీ బి పామ్ లు పొందగా జీవన్ రెడ్డి అనుచరులకు మాత్రం చుక్కెదురైంది దాంతో వారు నిరుత్సాహంతో కన్నీటి పర్యంతమయ్యారు. చివరకు పూర్తిగా రాయికల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ రాజకీయం ముఖచిత్రం రాయికల్ పట్టణంలోని మారింది, మొన్నటి వరకు పవర్ కేంద్రంగా ఉన్న వారు కనుమరుగు అవుతారా? గతంలో లాగా తాజా మాజీ లే కీలకంగా మరుతారా అనేది మరికొద్ది రోజుల్లో తేలని ఉంది.

# నందికొండ బరిలో 37 మంది అభ్యర్థులు

**42 మంది అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ**
**మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి వెల్లడి**
**12 వార్డుల్లో ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ**

నాగార్జునసాగర్ ఫిబ్రవరి 3 వాయిస్ టుడే ప్రతినిధి: నందికొండ మున్సిపాలిటీ లో ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో బరిలో నిలిచే అభ్యర్థుల వివరాలను మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి మంగళవారం అధికారికంగా ప్రకటించారు,మున్సిపాలిటీలోని 12 వార్డులకు గాను 37 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు,ఈ సందర్భంగా కమిషన్ తెలిపిన వివరాల ప్రకారం 12 వార్డులకు గాను తొలుత 95 మంది అభ్యర్థులు ఆసక్తి చూపగా,వివిధ కారణాలతో కొందరు,79 కి చేరింది,ఉపసంహరణలతో 42 మరికొందరు తప్పుకోవడంతో బరిలో ఉండేవారి సంఖ్య తగ్గింది,ఈ నేపథ్యంలో 37 మంది అభ్యర్థులు ఎన్నికల పోటీలో నిలిచారు. కమిషనర్ వెల్లడించిన జాబితా ప్రకారం,వివిధ రాజకీయ పార్టీల నుండి పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి,కాంగ్రెస్ పార్టీ నుంచి 12 అభ్యర్థులు,బి.ఆర్.ఎస్ పార్టీ నుంచి 12 అభ్యర్థులు భారతీయ జనతా పార్టీ 09 అభ్యర్థులు,స్వతంత్ర అభ్యర్థులు 03,ఆమ్ ఆద్మీ పార్టీ 01 ఎన్నికల బరిలో ఉన్నట్లు వెల్లడించారు,అభ్యర్థుల ఖరారు అనంతరం కమిషనర్ మాట్లాడుతూ,ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున అభ్యర్థులందరూ నిబంధనలకు లోబడి ప్రచారం నిర్వహించుకోవాలని సూచించారు, ఫిబ్రవరి 11న జరగనున్న పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామని,ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.



# ముజిగి మల్లన్న స్వామిని దర్శించుకున్న నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షులు, బిజెపి నాయకులు వి. సత్యనారాయణ గౌడ్

నిర్మల్ జిల్లా ప్రతినిధి ( వాయిస్ టుడే) ఫిబ్రవరి 3: నిర్మల్ మండలం ముజిగి మల్లన్న స్వామి జాతర సందర్భంగా నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు వి. సత్యనారాయణ గౌడ్ మంగళవారం దేవుడిని దర్శించుకొని మొక్కలు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు,కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ నిర్మల్ జిల్లా ప్రజలను, భక్తులకు సుఖ సంతోషాలు కలిగించాలని, రైతులకు పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆయన కోరుకున్నారు. భక్తుల కోరికలు తీర్చే మల్లన్న దేవుడు అని మల్లన్న స్వామి విశేషాలను వివరించారు. ఆయన వెంట ముజిగి మాజీ ఉపసర్పంచ్ లు అశ్వత్థామ, పల్లికొండ ముత్యం, నరసయ్య, బిజెపి నాయకులు మౌలానా, కె రవీందర్ రెడ్డి,రాజేశ్వర్ ప్రవీణ్, రాజు, సిహెచ్ రాజు ,హుస్సేన్, ఆనంద్, గణేష్, పృథ్వి తదితరులు ఉన్నారు.



# ఇంటింటికి ప్రచారంతో దూసుకుపోతున్న పూదరి సంపత్

**11వార్డు ప్రజలు ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థన**

హుస్నాబాద్, వాయిస్ టుడే ప్రతినిధి ఫిబ్రవరి 4 : రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సందర్భంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల వాతావరణం రోజుకు వేడెక్కుతున్న తరుణంలో మున్సిపల్ ఎన్నికలలో తీవ్ర పోటీ నెలకొంది.ఈసారి హుస్నాబాద్ మున్సిపల్ పరిధిలోని 11వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థిగా పూదరి సంపత్ పోటీ చేస్తున్నారు.మున్సిపల్ రాజకీయాల్లోపూదరి సంపత్ తనదైన శైలిలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. రాజకీయాల్లో వార్డు ప్రజల్లో పూదరి సంపత్ కు మంచి పేరు ఆదరణ ఉండటముతో గెలుపు ఖాయమని వార్డు ప్రజలు తెలిపారు.చాలా సంవత్సరాల నుండి 11వ వార్డులో స్థానికుడై ఉండటం పట్టణ, వార్డు సమస్యలపై అవగాహన ఉండటం మరియు సమస్యలపై అవగాహన ఉందన్నారు. వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలు అందిస్తారని నమ్మకం ప్రజల్లో విశ్వాసం ఏర్పడింది.పూదరి సంపత్ కిఅన్ని వర్గాల ప్రజలతో అందరితో సత్సంబంధాలు కలిగి ఉన్నారు.వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల మద్దతు కల్పించాలని కోరుతున్నారు త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందేందుకు ప్రజల సహకారం కావాలని ప్రణాళిక వైపుగా సాగుతున్నారు.వారి పయనం విజయపతంలోకి రావాలని కౌన్సిలర్ గా విజయదుందుభి మోగించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.వార్డులో ప్రధాన సమస్యలుసీసీ రోడ్లు,స్ట్రీట్ లైట్లు, మురికి కాలువలు వార్డులో ఏర్పాటు చేస్తానని, అవసరమైన ఏర్పాటు చేస్తామన్నారు.పూదరి సంపత్ ను కౌన్సిలర్ గా గెలిపిస్తే ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేస్తామని ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామని వార్డు సమస్యలను ప్రభుత్వం దృష్టికి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు. వార్డ్ ప్రజలకు మంచి చేయాలని తపనతో ముందుకు నిస్వార్థంగా ప్రజలకు పాలన అందించుటకు ముందుకు వస్తున్నామని మేము వేయబోయే అడుగులకు దారి మీ ఓటు అనిమమ్మల్ని ఆశీర్వదించి అధిక మెజారిటీతో గెలిపించుకోగలరని వార్డు ప్రజలను కోరుతున్నారు.

# ప్రచారంలో దూసుకుపోతున్న సావుల మంజులారామకృష్ణ

**10వ వార్డు ప్రజలు ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థన**



హుస్నాబాద్, వాయిస్ టుడే ప్రతినిధి ఫిబ్రవరి 4 : రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల వాతావరణం రోజుకు వేడెక్కుతున్న తరుణంలో మున్సిపల్ ఎన్నికలలో తీవ్ర పోటీ నెలకొంది.ఈసారి హుస్నాబాద్ మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులో మంజులరామకృష్ణ పోటీ చేస్తున్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ రాజకీయాల్లో మంజులరామకృష్ణ తనదైన శైలిలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. రాజకీయాల్లో వార్డు ప్రజల్లో మంజులరామకృష్ణ మంచి పేరు ఆదరణ ఉండటముతో గెలుపు ఖాయమని ప్రజలు తెలిపారు.చాలా సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీలో ఉండి వార్డు పట్టణ సమస్యలపై అర్థం చేసుకోవడం వాటి పరిష్కారాలు సూచించడం, సమస్యలపై అవగాహన ఉందని వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలు అందిస్తారని నమ్మకం ప్రజల్లో విశ్వాసం ఏర్పడింది. మంజులరామకృష్ణకి అన్ని వర్గాల ప్రజలతో అందరితో సత్సంబంధాలు కలిగి ఉన్నారు.వార్డులో తిరుగుతూ ప్రజల మద్దతు కల్పించాలని కోరుతున్నారు త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందేందుకు ప్రజల సహకారం కావాలని ప్రణాళిక వైపుగా సాగుతున్నారు.వారి పయనం విజయపతంలోకి రావాలని కౌన్సిలర్ గా విజయదుందుభి మోగించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.వార్డులో ప్రధాన సమస్యలు వార్డులో ,ప్రధాన సమస్యలు వార్డులో డ్రానేజీలు సరిగా లేవని ప్రతి గల్లీలో మురికి కాలువలు సీసీ రోడ్లు, అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు, అర్హులైన వారికి పించండ్లు, రేషన్ కార్డులు ఇప్పిస్తామన్నారు.మినీ ఫంక్షన్ హాల్ నిర్మిస్తామన్నారు.మంజులరామకృష్ణ కౌన్సిలర్ గా గెలిపిస్తే ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేస్తామని ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామని వార్డు సమస్యలను ప్రభుత్వం దృష్టికి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని హామీ ఇస్తామని అభిప్రాయం వ్యక్తం చేశారు. వార్డ్ ప్రజలకు మంచి చేయాలని తపనతో ముందుకు నిస్వార్థంగా ప్రజలకు పాలన అందించుటకు ముందుకు వస్తున్నామని మేము వేయబోయే అడుగులకు దారి మీ ఓటు అనిమమ్మల్ని ఆశీర్వదించి అధిక మెజారిటీతో గెలిపించుకోగలరని వార్డు ప్రజలను కోరుతున్నారు.

# ఎడ్ బిడ్ గ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన మల్లన్న జాతర

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 3 : ముధోల్ మండలంలోని హెడ్ బీడుముఖ్య అతిథిగా ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు భక్తిశ్రద్ధలతో మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గారికి బెల్లం ముద్దులతో తులాభారం నిర్వహించారు.అనంతరం జాతరలో భాగంగా నిర్వహించిన కుస్తీ పోటీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# ఘనంగా చింత సాయినాథ్ జన్మదిన వేడుకలు

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే: ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తనయుడు చింత సాయినాథ్ జన్మదిన వేడుకలు సంగారెడ్డిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని శాలువాలతో సన్మానించి, కేక్ కట్ చేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చింత సాయినాథ్ మాట్లాడుతూ తనపై చూపిన ప్రేమాభిమానాలకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ప్రజలకు మరింత సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతానని పేర్కొన్నారు. ఈ వేడుకలు ఆత్మీయ వాతావరణంలో ఉత్సాహంగా కొనసాగగా, పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరించాయి.



# బీఆర్ఎస్ లో చేరిన ఎంఐఎం నేతలు

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే: సంగారెడ్డి పట్టణంలోని 5వ వార్డుకు చెందిన ఎంఐఎం పార్టీ నాయకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. సంగారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బసిత్ (లడ్డు), 5వ వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి యూనిస్ ఆధ్వర్యంలో, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సమక్షంలో వీరు అధికారికంగా బిఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, పార్టీ ఇన్‌చార్జి రాజనర్సు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. 5వ వార్డు ఎంఐఎం అధ్యక్షుడు షేక్ షరీఫ్‌తో పాటు సయ్యద్ జాఫర్ హుస్సిన్, సయ్యద్ సలీముద్దీన్, హాజీ, అబ్బాస్, రజిద్దీన్, రుషి, నబి, మజీద్, ఖలీల్, తాహేర్, జకీర్, ఇమ్రాన్, తలఫ్ తదితరులు కలిపి సుమారు 50 మంది బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ, అందరూ సమన్వయంతో పనిచేసి బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. పార్టీ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అర్షద్, మసూద్, సిరాజ్ హైమద్, జహీరోద్దీన్, మినిరోద్దీన్, సమీర్, మూజమిల్, ఇమ్రాన్ పాల్గొన్నారు.



# క్యాన్సర్‌కు చెక్ పెట్టాలి - ప్రజల ఆరోగ్యం కాపాడాలి: జడ్జి దుర్గం గణేశ్

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా ఫిబ్రవరి-03 వాయిస్ టుడే : క్యాన్సర్ మహమ్మారిని పారద్రోలాలని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పేషంట్లకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పేషంట్లకు క్యాన్సర్ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి వ్యాధి పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతి రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ రమాదేవి, న్యాయవాదులు మాదూరి ఆంజనేయులు, వొడ్నాల రవీందర్, జోగుల రమేష్, ఎస్సై వేణుగోపాల్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.





# సూక్ష్మ పరిశీలకులు విధులపై పూర్తి అవగాహనతో పనిచేయాలి

**లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, డీఈవో భోజన్న సూచన**

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 3: నిర్మల్ ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకులు (మైక్రో అబ్జర్వర్లు) కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నందున తమ విధులపై స్పష్టమైన అవగాహనతో, నిష్పక్షపాతంగా పనిచేయాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, జిల్లా విద్యాశాఖాధికారి భోజన్న సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వారు మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహించే మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో అనుసరించాల్సిన నియమాలు, పోలింగ్ కేంద్రాలలో పర్యవేక్షణ విధానం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, పోలింగ్ ప్రక్రియలో జాగ్రత్తలు వంటి అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా సూక్ష్మ పరిశీలకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో జరిగే ప్రతి ప్రక్రియను నిశితంగా గమనిస్తూ, ఏవైనా అసాధారణ పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు. మైక్రో అబ్జర్వర్లు క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ ఎన్నికల స్వచ్ఛతను కాపాడటంలో తమ వంతు బాధ్యతను సమర్థంగా నిర్వహించాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ఉపసంహరణ నేపథ్యంలో పటిష్ట బందోబస్తు

**పరిశీలించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్**



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 3: మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, ఈరోజు నామినేషన్ ఉపసంహరణ (విడ్రాల్) ప్రక్రియ జరుగుతున్న దృష్ట్యా, ఈరోజు జిల్లా ఎస్పీ మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నామినేషన్ సెంటర్‌ను సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన పటిష్ట బందోబస్తును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... నామినేషన్ ఉపసంహరణ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు అన్ని భద్రతా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు అధికారులకు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.



# బిఆర్ఎస్ అభ్యర్థులకు బీఫారం అందించిన చిట్టెం

మక్తల్ ఫిబ్రవరి 03 వాయిస్ టుడే ప్రతినిధి: మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మంగళవారం నాడు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బి ఫారం అందించిన అనంతరం బిఆర్ఎస్ పార్టీకి చెందిన పోటీ చేస్తున్న అభ్యర్థులతో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కొత్త శ్రీనివాస్ గుప్తా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి నరసింహ గౌడ్ మండల పార్టీ అధ్యక్షుడు ఏ మహిపాల్ రెడ్డిపట్టణ అధ్యక్షుడు చిన్న హనుమంతు అన్వర్ హుస్సేన్ పట్టణ ప్రధాన కార్యదర్శి చందాపురం అశోక్ కుమార్ గౌడ్ కొత్త గార్లపల్లి నరసింహ రెడ్డి జుట్ల సాగర్ నరేష్ ఇతరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్‌కు షాక్.. బీజేపీలో భారీ చేరికలు

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే. సంగారెడ్డి పట్టణంలోని 12వ వార్డులో బీఆర్ఎస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ వార్డుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు గట్టు మీది శ్రీనివాస్ సుమారు 50 మంది కార్యకర్తలతో కలిసి కౌన్సిలర్ అభ్యర్థి సాహితీ రాము ఆధ్వర్యంలో బీజేపీలో అధికారికంగా చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ నాయకుల సమక్షంలో గట్టు మీది శ్రీనివాస్‌కు సాహితీ రాము పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి సాహితీ రాముకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ, ఘన విజయం సాధించేలా కార్యకర్తలతో కలిసి అహర్నిశలు కృషి చేస్తామని స్పష్టం చేశారు. బీజేపీ విధానాలు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై విశ్వాసంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు. ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో బీజేపీలో చేరినట్లు పేర్కొన్నారు. ఈ చేరిక కార్యక్రమంలో బీజేపీ నాయకులు, స్థానిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## పోలీస్ జాగిలాలతో గంజాయి హాట్స్పాట్స్ తనిఖీలు

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జనవరి ఫిబ్రవరి 3: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాలతో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ సూచనలతో కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గంజాయి హాట్స్పాట్స్ తనిఖీలు నిర్వహించారు.కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి హాట్స్పాట్స్ గా గుర్తించబడిన ప్రదేశాలలో ఈ తనిఖీలు చేపట్టడం జరిగిందని త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.ఈ తనిఖీలను నిర్వహించడం కోసం మత్తు పదార్థాలను కనిపెట్టే పోలీస్ జాగిలాలను ఉపయోగించడం జరిగిందని వివరించారు.ఎవరైనా గంజాయి సరఫరా చేస్తున్నట్లుగానీ, అక్రమ రవాణా చేస్తున్నట్లుగానీ,సేవిస్తున్నట్లుగానీ తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని సీఐ కోరారు.

## నిర్మల్ మున్సిపాలిటీలో 13 నామినేషన్ల విత్ డ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 3: నిర్మల్ మున్సిపాలిటీలో 42 వార్డులకు 635 నామినేషన్లు రాగా నామినేషన్ల ఉపసంహరణ మంగళవారం కొనసాగుతుంది నిన్నటి వరకు ఐదుగురు విత్ డ్రాచేసుకోగా ఇవ్వాల మధ్యాహ్నం ఒంటిగంట వరకు 8మంది విత్ డ్రా చేసుకున్నారు మున్సిపల్ కార్యాలయంలో ఇద్దరు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆరుగురు విత్ డ్రా చేసుకున్నారు ఈరోజు వరకు మొత్తం 13 నామినేషన్లు విత్ డ్రా అయ్యాయని అధికారులు తెలిపారు.



## పలువురినీ పరామర్శించిన నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి శ్రీహరిరావు

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 3: నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కూచాడి శ్రీహరిరావు మంగళవారం ఆదిత్య హాస్పిటల్ లో కాంగ్రెస్ నాయకులు జియా గుండె సమస్యతో బాధపడుతున్న మరియు వందన జనరల్ సర్జికల్ క్రిటికల్ హాస్పిటల్ శిష్ట్ర వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడు మోహిన్ కుమారుడు అపెండెక్స్ ఆపరేషన్ తో చికిత్స పొందిన సమస్యలను తెలుసుకుని వారికి పరామర్శించిన నిర్మల్ నియోజక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి శ్రీహరి రావు వారితో పాటు కాంగ్రెస్ నాయకులు మాజార్ ఖాన్, శబాకలీం, కొట్టే శేఖర్, అతిక్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఈటెల శ్రీనివాస్ , మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ సాయి , కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ చైర్మన్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



## సభలో ఇబ్బందులు కలకుండా చూడాలి

మిర్యాలగూడ ఫిబ్రవరి 3(వాయిస్ టుడే): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిర్యాలగూడ పర్యటన నేపథ్యంలో సభలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ లు అన్నారు. మంగళవారం మిర్యాలగూడ సమీపంలోనూ గూడూరు సభా స్థలాన్ని పరిశీలించారు. హేలిప్యాడ్, ప్రధాన వేదిక, రాష్ట్ర ముఖ్యమంత్రి చేతులమీదుగా చేసే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల శిలాఫలకాల స్థలం, బహిరంగ సభకు హాజరయ్యే ప్రజల కోసం చేసిన ఏర్పాట్లు, తాగునీరు, బ్యారికేడింగ్, తదితర అన్ని ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డి ఎస్ పి రాజశేఖర్ రాజు, జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, ఇతర అధికారులు ఉన్నారు.

# అభ్యర్థులకు బీ-ఫామ్‌లు అందజేసిన నోముల భగత్

### బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి

### మాజీ ఎమ్మెల్యే భగత్ కుమార్ పిలుపు



నాగార్జునసాగర్ ఫిబ్రవరి 3 వాయిస్ టుడే ప్రతినిధి: నందికొండ మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థులకు బి ఫామ్ లను అందజేసిన మాజీ శాసనసభ్యులు నోముల భగత్, మంగళవారం నాగార్జునసాగర్ నందికొండ మునిసిపాలిటీలో మాజీ ఎమ్మెల్యే పార్టీ అభ్యర్థులకు అధికారికంగా బీ-ఫామ్ లను అందజేసి,అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ అభ్యర్థులు ప్రతి ఒక్కరు మన ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను ఇంటింటికీ తీసుకెళ్లి,ప్రజల ఆశీస్సులు పొందాలని అభ్యర్థులకు సూచించారు, కార్యకర్తలు,నాయకులు సమన్వయంతో పనిచేసి బిఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల నుండి పోటీ చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు 1 పమ్మి శ్రావణి రెడ్డి (జనార్దన్ రెడ్డి) 2 మొహ్మద్ ఘని 3పుట్టపాక హర్ష వర్ధన్ 4 యనమల అన్నపూర్ణ (విజయ్) 5 లింగాల పెద్దులు 6సపావత్ చంద్రమౌళి నాయక్ 7 సయ్యద్ షాహెదా బేగం (అబ్దుల్ ఖాదర్) 8 నకిరేకంటి రమణమ్మ (సైదులు) 9 బత్తుల శేఖర్ బాబు 10 కొడ సరోజ (నూకరాజు) 11 హిరేకార్ రమేష్ జి 12 ఎర్ర మంజు శ్రీ,బరిలో ఉన్నారు,బీ-ఫామ్‌లు అందుకున్న అనంతరం అభ్యర్థులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో అవకాశం కల్పించిన కేసీఆర్,కేటీఆర్ మరియు నోముల భగత్ కుమార్,కృతజ్ఞతలు తెలిపారు,వార్డుల అభివృద్ధియే ధ్యేయంగా పనిచేస్తామని ధీమా వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు



## ఈనెల 15న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణం విజయవంతం చేయండి

### 16న గాయత్రి అమ్మవారి ఆశ్రమంలో మహా అన్నదానం

### కళ్యాణం పోస్టర్ ఆవిష్కరణలో
### రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

వాయిస్ టుడే ప్రతినిధి ఫిబ్రవరి 4 హుస్నాబాద్ ప్రతినిధి: హుస్నాబాద్: ఈనెల 15న,కేశవాపూర్ లోని రామస్వామి గుట్టపైన గల ఆలయంలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి – గోవిందమాంబ అమ్మవారి కళ్యాణం విజయవంతం చేయాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని వైశ్య భవన్ లో మంగళవారం రోజున ఆలయ ఫౌండర్ – చైర్మన్,ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ కందారపు రమేశాచార్యులు తో పాటు హుస్నాబాద్ ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేడం లింగమూర్తి,సింగిల్ విండో మాజీ చైర్మన్ బొలిశెట్టి శివయ్య,రైతు ఆత్మ కమిటీ డివిజన్ ఛైర్మన్ జంగపల్లి,మాజీ ఎంపిపి ఆకుల వెంకట్,స్థానిక నాయకులతో కల్సి కల్యాణం పోస్టర్ ఆవిష్కరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ భవిష్యత్తు ను ముందే చెప్పిన కాలజ్ఞాని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి అని కొనియాడారు. కల్యాణం లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



### బీ ఆర్ ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వి.సతీశ్ కుమార్...

హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్ ఎస్ కార్యాలయంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే వి.సతీశ కుమార్ బ్రహ్మంగారి కల్యాణం సంబందించిన పోస్టర్ ఆవిష్కరణ చేసి మాట్లాడారు. భవిష్యత్ ను బోధించిన గొప్ప తత్వవేత్త విష్ణు అంశ సంభూతులు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి అన్నారు. శివరాత్రి 15న,నిర్వహించే కల్యాణంతో భక్తులు హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు. 17న,ఆలయ దిగువన గల శ్రీ గాయత్రి ఆశ్రమంలో మహా అన్నదానం కూడా ఏర్పాటు చేశారని భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని సతీశ్ కుమార్ పిలుపునిచ్చారు. ఇందులో హుస్నాబాద్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు అన్వర్, అక్కన్నపేట బీఆర్ ఎస్ మండల అధ్యకుడు పెసరు సాంబరాజు,మాజీ జెడ్పిటీసీ బీలు నాయక్,ఏఎంసీ మాజీ చైర్మన్లు ఎడబోయిన తిరుపతిరెడ్డి,లింగాల సాయన్న,మాజీ మండల అధ్యక్షుడు వంగ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శెట్టిపాలెం పోస్టాఫీసులో ప్రమాద బీమా చెక్ పంపిణీ

### నామినీ షేక్ జులేక బీకి రూ.15 లక్షల చెక్ అందజేత



వేములపల్లి, ఫిబ్రవరి 03 (వాయిస్ టుడే): మండలం పరిధిలోని శెట్టిపాలెం పోస్టాఫీసులో గురువారం నివా భూపా ప్రమాద బీమా పాలసీకి సంబంధించిన చెక్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ప్రమాద బీమా పాలసీ నామినీ అయిన షేక్ జులేక బీ కి రూ.15 లక్షల విలువైన చెక్కును సూర్యాపేట పోస్టల్ డివిజన్ ఎస్పీ సంతోష్ అధికారికంగా అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ సంతోష్ మాట్లాడుతూ, ప్రమాద బీమా పథకాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని, ముఖ్యంగా అనుకోని ప్రమాదాల సమయంలో కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తాయని అన్నారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా అందుబాటులో ఉన్న బీమా, సేవింగ్స్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో నివా భూపా రీజినల్ మేనేజర్ అర్జున్, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ మేనేజర్ రాజేష్, వేములపల్లి గ్రామ సర్పంచ్ పుట్టల సందీప్, శెట్టిపాలెం గ్రామ సర్పంచ్ పెదపంగా సైదులు, ఉపసర్పంచ్ కంచర్ల సురేందర్ రెడ్డి, వేములపల్లి సబ్ పోస్ట్ మాస్టర్ షకీల్, ఎంఓ ఉపేందర్ రెడ్డి, ఎంఏ మతీన్, బీపీఎంలు పుట్టల రవి, వరుణ్, రేవంత్ కుమార్, పెద్దపంగ ప్రసన్న కుమార్, సురేష్, ఖాజా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ చెక్ పంపిణీ కార్యక్రమం పోస్టల్ శాఖ సేవలపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచిందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి పథకాల ద్వారా ప్రజలకు మరింత సేవలు అందిస్తామని అధికారులు తెలిపారు.



## నందికొండ అభ్యర్థులకు బి-ఫామ్ ల పంపిణీ

### విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులకు దిశా నిర్దేశం : ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి

నాగార్జునసాగర్ ఫిబ్రవరి 3 వాయిస్ టుడే ప్రతినిధి: నాగార్జునసాగర్ పరిధిలోని నందికొండ మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల సందర్భంగా మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కుందురు జయవీర్ రెడ్డి అధికారికంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు బి-ఫామ్‌లను అందజేశారు అభ్యర్థులందరూ సమన్వయంతో పనిచేసి పార్టీ జెండాను ఎగురవేయాలని ఆయన ఈ సందర్భంగా అభ్యర్థులకు ఆకాంక్షించారు. మున్సిపాలిటీలోని వివిధ వార్డుల నుండి పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితాను ఎమ్మెల్యే విడుదల చేశారు,1యాడికి నాగమల్లేశ్వరి 2 నటువ నరేంద్రర్ 3 గొడవర్తి రాజా ప్రసాద్ 4 మంద గౌతమి 5 పామర్థు పొనుగోటి బాబురావు 6 ఆంగోత్ చందులాల్ 7 మైలపల్లి జానకి 8 దేవుళ్ళ శివపార్వతి 9 ఇర్ల రామకృష్ణ 10 వి వినీష 11 పగడాల నాగరాజు 12 మానస స్వర్ణ వీరితో పాటు పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని వెల్లడించారు,బి-ఫామ్‌ల పంపిణీ అనంతరం ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులను,సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు నందికొండ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధే మన లక్ష్యమని,ఓటర్లను కలిసి వారి సమస్యలను తెలుసుకోవాలని అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు, కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేసి ఈ ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, కౌన్సిలర్ అభ్యర్థులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆనందంగా జీవించండి..!

### – పీఠాధిపతి డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి

### – భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ యజ్ఞం

వాయిస్ టుడే ఝరాసంగం ఫిబ్రవరి 03: మనిషి జీవితంలో మనసు శాంతిగా ఉంటేనే నిజమైన ఆనందం లభిస్తుంది. భగవంతుని నామస్మరణతో, సేవాభావంతో జీవిస్తే జీవితం సార్థకమవుతుందని, ప్రతి ఒక్కరూ ఆనందంగా జీవించాలని సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి మహామండలేశ్వర్ డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ పేర్కొన్నారు. మంగళవారం మాఘమాస బహుళ విదియ సందర్భంగా లోక కళ్యాణార్థం లక్ష జప మృత్యుంజయ యజ్ఞం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ యజ్ఞంలో గణపతి పూజ, పుణ్యావచనం, యాగశాల ప్రవేశం, హోమాలు, అవాహనలు నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య మధ్యాహ్నం 1:21 నిమిషాలకు పూర్ణాహుతి చేశారు. ప్రతి ఒక్కరు రోజు చిరునవ్వుతో మొదలుపెట్టి, సత్యం, ధర్మ మార్గంలో నడిస్తే ఆనందమే మన సహచరుడవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ అనసూయ మాత, పూజ్యశ్రీ నందిని శ్రీగిరి మాతాజీ, ఉత్సవ కమిటీ సభ్యులు రమేష్ పాటిల్, కోట శ్రీనివాస్, ఎల్లన్న, నాగన్న పాటిల్‌తో పాటు జహీరాబాద్, నారాయణఖేడ్, బీదర్, సంగారెడ్డి, ఝరాసంగం తదితర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

## ప్రచారంలో దూసుకుపోతున్న గాదపాక రవీందర్

### 17వ వార్డు ప్రజలు ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థన



వాయిస్ టుడే ప్రతినిధి ఫిబ్రవరి 4 హుస్నాబాద్ ప్రతినిధి: రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల వాతావరణం రోజుకు వేడెక్కుతున్న తరుణంలో మున్సిపల్ ఎన్నికలలో తీవ్ర పోటీ నెలకొంది.ఈసారి హుస్నాబాద్ మున్సిపల్ పరిధిలోని 17వ వార్డులో గాదపాక రవీందర్ పోటీ చేస్తున్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ రాజకీయాల్లో గాదపాక రవీందర్ తనదైన శైలిలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. రాజకీయాల్లో వార్డు ప్రజల్లో గాదపాక రవీందర్ కు మంచి పేరు ఆదరణ ఉండటముతో గెలుపు ఖాయమని ప్రజలు తెలిపారు.చాలా సంవత్సరాల నుండి టిఆర్ఎస్ పార్టీలో లో ఉండి మాజీ కౌన్సిలర్ గా అనుభవం వార్డు పట్టణ సమస్యలపై అర్థం చేసుకోవడం వాటి పరిష్కారాలు సూచించడం, సమస్యలపై అవగాహన ఉందని వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలు అందిస్తారని నమ్మకం ప్రజల్లో విశ్వాసం ఏర్పడింది. గాదపాక రవీందర్‌కి అన్ని వర్గాల ప్రజలతో అందరితో సత్సంబంధాలు కలిగి ఉన్నారు.వార్డులో తిరుగుతూ ప్రజల మద్దతు కల్పించాలని కోరుతున్నారు త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందేందుకు ప్రజల సహకారం కావాలని ప్రణాళిక వైపుగా సాగుతున్నారు.వారి పయనం విజయపతంలోకి రావాలని కౌన్సిలర్ గా విజయదుందుభి మోగించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.వార్డులో ప్రధాన సమస్యలు వార్డులో ,ప్రధాన సమస్యలు వార్డులో డ్రానేజీలు సరిగా లేవని ప్రతి గల్లీలో మురికి కాలువలు సీసీ రోడ్లు, అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు, అర్హులైన వారికి పింఛండ్లు, రేషన్ కార్డులు ఇప్పిస్తామన్నారు. గాదపాక రవీందర్ ను కౌన్సిలర్ గా గెలిపిస్తే ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేస్తామని ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామని వార్డు సమస్యలను ప్రభుత్వం దృష్టికి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని హామీ ఇస్తామని అభిప్రాయం వ్యక్తం చేశారు.